
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 31 జూలై 2025

భద్రాద్రిలో ఏడు.. ఖమ్మంలో రెండు

- ఉమ్మడి జిల్లాలో ఏడు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం సన్నాహాలు
- టూరిజం హబ్‌లుగా అభివృద్ధికి కసరత్తు
- వసతులపై నివేదిక కోరిన కేంద్ర పర్యాటక శాఖ



ఖమ్మం గడ్డను.. బీజేపీ అడ్డాగా మారుస్తాం

- కమ్యూనిస్టులంతా బీజేపీ వైపు చూస్తున్నారు
- 19 నెలల్లోనే కాంగ్రెస్ సర్కారుపై వ్యతిరేకత
- వచ్చే స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కమలానివే..
- కేంద్రం చేసినట్లే రాష్ట్ర ప్రభుత్వం రామాలయ అభివృద్ధిని చేపట్టాలి
- ఆ 'ఐదు' విషయంలో స్థానికుల మనోభావాలను గుర్తించి నవంతు ప్రయత్నం చేస్తా
- భద్రాద్రి జిల్లా పర్యటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు



ఇల్లెందులో మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

ఇల్లెందు రూరల్/ పాల్వంచ /భద్రాచలం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న ఖమ్మం గడ్డను ఇకపై బీజేపీ అడ్డాగా మారుస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు అన్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు, పాల్వంచతో పాటు భద్రాచలంలో ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో రామచంద్రరావు విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాను కమ్యూనిస్టుల గడ్డగా భావించేవారని.. కానీ ప్రస్తుతం కమ్యూనిస్టులంతా బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు, రానున్న కాలంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు నల్గొండ, వరంగల్ జిల్లాల్లో బీజేపీ బలమైన శక్తిగా మారనుందని తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఉన్న సీతారామ ప్రాజెక్టు ద్వారా గిరిజన రైతుల భూములకు నీళ్లు ఇవ్వకుండా డిజైన్‌లు మార్చి ఇతర ప్రాంతాలకు తరలించడం మంత్రులకు సరైంది కాదన్నారు. ప్రాజెక్టులు రైతులకు లాభం చేకూర్చే విధంగా ఉండాలే కానీ కాంట్రాక్టర్లకు లాభం చేకూరే విధంగా ఉండొద్దన్నారు. నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇలాగే పని చేస్తున్నాయని ఆరోపించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ పేరిట నేడు కాంగ్రెస్ ఆడుతున్న డ్రామాలు, గతంలో బీసీలకు 50శాతం రిజర్వేషన్ ఇస్తామని నమ్మబలిగిన బీఆర్ఎస్.. బీసీలను మోసగించడంలో పోటీ పడుతున్నాయని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ పేరుతో ముస్లింలకు 10శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తుందన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ మాట్లాడుతున్న తీరు పాకిస్థాన్ మద్దతుగా ఉన్నట్లు ఉందని, దేశాన్ని అస్థిరపరిచే కుట్రలను బీజేపీ సహించబోదని హెచ్చరించారు. కేవలం 19 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అన్నారు. పాల్వంచలోని ఎస్‌కేటీ అపార్ట్‌మెంట్‌లో కేటీపీఎస్ కార్మికులు, ఇంజనీర్లతో ఆయన చిట్ చాట్ నిర్వహించారు. అనంతరం విలేకరులతో (మిగతా 6వ పేజీలో)

ప్రతీ విద్యార్థితో పాటు వారి తల్లిదండ్రులు ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలో సీటు రావాలని కోరుకుంటారు. కానీ ఖమ్మంజిల్లా పాలేరు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ సీటు అంటే మాత్రం వెనుకడుగేస్తున్నారు. ఇక్కడ సమస్యలు చూసి భయపడి ఈ కాలేజీలో చేరేందుకు భయపడుతున్నారు. దీంతో ఈ ఏడాది ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో కూడా సగం సీట్లు ఖాళీగానే ఉన్నాయి. మొత్తం 330 సీట్లు ఉండగా ఈ ఏడాది మొదటి, రెండో విడతల్లో కలుపుకొని 163 సీట్లు కౌన్సెలింగ్‌లో భర్తీ అయ్యాయి. అయితే మొదటి కౌన్సెలింగ్‌లో 203 మంది విద్యార్థులు పాలేరు జేఎన్‌టీయూకు ఆప్షన్ పెట్టగా.. సీట్లు పొందిన విద్యార్థులు పలు ఇబ్బందులు, సమస్యల రీత్యా రెండో విడత కౌన్సెలింగ్ అనంతరం సుమారు 40 మంది విద్యార్థులు ఇతర కాలేజీలకు ఆప్షన్ పెట్టుకుని వెళ్లిపోయారు. ఈ క్రమంలో రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు ఖాళీ అయ్యాయి. ఇక ఇప్పుడు ఉన్న 163మందిలో మూడో కౌన్సెలింగ్ పూర్తయ్యే సమయానికి ఎంతమంది మిగులుతారో అర్థం కాని పరిస్థితి.



సగం ఖాళీగానే!

నిండని పాలేరు జేఎన్‌టీయూ సీట్లు

- మూడు గ్రూపుల్లో నామమాత్రంగానే భర్తీ
- ఇంజనీరింగ్ కాలేజీని వేధిస్తున్న సమస్యలు
- చేరేందుకు భయపడుతున్న విద్యార్థులు

ఖమ్మం, జూలై 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ ఏడాది పాలేరు జేఎన్‌టీయూలో బీటెక్ కౌన్సెలింగ్ రెండో విడత ఆప్షన్ ప్రకారం సీఎస్ఈ 66 సీట్లకు 64, డేటాసైన్సు 66కు60, ఈసీఈ 66కు22, ట్రిపుల్ఈ 66కు13, మెకానికల్ 66కు నలుగురు మాత్రమే ఆప్షన్లు ఇవ్వడంతో వీరికి సీట్లు కేటాయించారు. వచ్చే నెల 2లోపు సర్టిఫికెట్లు ఇచ్చి రిపోర్టు చేయాల్సి ఉంది. మూడో కౌన్సెలింగ్ నాటికి మరికొన్ని సీట్లు ఖాళీ అయ్యే అవకాశం ఉంది. జేఎన్‌టీయూ ప్రభుత్వ కాలేజీ అని ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల విద్యార్థులు ఇక్కడ ఆప్షన్లు ఇచ్చి.. కాలేజీ పరిస్థితులను చూసుకునేందుకు తల్లిదండ్రులతో కలిసి వస్తుంటారు. కానీ ఇక్కడికి వచ్చిన తర్వాత వారంతా వెనక్కి వెళ్లిపోతున్నారు.

పట్టించుకోని జేఎన్‌టీయూ పాలకవర్గం

గత బీఆర్ఎస్ హయాంలో 2023లో ఖమ్మం జిల్లా పాలేరు, మహబూబాబాద్‌లో రెండు జేఎన్‌టీయూ కాలేజీలు మంజూరయ్యాయి. హడావుడిగా అడ్మిషన్ల చివరలో ప్రత్యేక కౌన్సెలింగ్ చేపట్టడంలో కేవలం అప్పుడు సీఎస్ఈ, డేటాసైన్సులో విద్యార్థులు నామమాత్రంగా చేరారు. కాలేజీ ప్రారంభ సమయంలో పూర్తిస్థాయి భవనాలు నిర్మిస్తామని, తక్షణం పర్మినెంట్ ఫ్యాకల్టీ నియమిస్తామని విద్యార్థులకు తల్లిదండ్రులకు తెలిపారు. కానీ కాలేజీ ప్రారంభించి రెండేళ్లు పూర్తయి మూడో ఏడాది ప్రారంభమైంది. గతేడాది కౌన్సెలింగ్‌లోనూ సగం సీట్లే భర్తీ అయ్యాయి. ఆ తర్వాత డిప్లొమాకు చెందిన విద్యార్థులు ఈసెట్ ద్వారా ఖాళీగా ఉన్న సీఎస్ఈ, డేటాసైన్సు, ట్రిపుల్ఈ , మెకానికల్, ఈసీఈలో చేరారు. అప్పటికి చాలా సీట్లు మిగిలాయి.

అన్నీ సమస్యలే..

పాలేరు జేఎన్‌టీయూకు సరైన భవనాలు లేవు. ఐటీడీఏకు చెందిన ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో మొదటి ఏడాది విద్యార్థుల కోసమని తాత్కాలికంగా ప్రారంభించారు. ఈ భవనంలోనే హాస్టల్, కాలేజీ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇతర చోట్ల ఖాళీగా ఇంజనీరింగ్ కాలేజీల భవనాలున్నా జేఎన్‌టీయూ అధికారులు వాటిని అద్దెకు తీసుకుని మార్చడంలేదు. విద్యార్థినులకు హాస్టల్‌లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలేజీ ఒకచోట, హాస్టల్ మరోచోట ఉండడంతో సరైన రక్షణలేక విద్యార్థినులు జాయిన్ కావడం లేదు. జాయిన్ అయినా తిరిగి టీసీ తీసుకుని వెళ్లే పరిస్థితి ఉంది. కాలేజీకి 41 ఎకరాల స్థలం ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకుని కాలేజీ శాశ్వత భవనాల నిమిత్తం గత నవంబరులో రూ.108.60కోట్లు మంజూరు చేయించారు. అయితే జేఎన్‌టీయూ పాలకమండలి నిర్లక్ష్యంతో ఇప్పటి వరకు టెండర్ల ప్రక్రియ పూర్తికాలేదు. కాలేజీకి సంబంధించిన కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసినా 30 కంప్యూటర్లు ఉండడంతో సరిపోవడం లేదు. మెకానికల్, ఈసీఈ, ట్రిపుల్ఈ ల్యాబులు ఏర్పాటుచేయలేదు. విద్యాబోధనకు అవసరమైన తరగతులు, ఫర్నీచర్, ల్యాబులు, హాస్టల్ వసతి సక్రమంగా లేక (మిగతా 6వ పేజీలో)

తక్షణం శాశ్వత ప్రొఫెసర్లను నియమించాలి

లింగాల రవికుమార్, విద్యార్థి తండ్రి



పాలేరు జేఎన్‌టీయూ ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ అని నమ్మి జాయిన్ చేశాం. మూడేళ్లవుతున్నా ఇక్క ఎలాంటి వసతులు లేవు. పక్కాభవనాలు నిర్మించలేదు. ఫ్యాకల్టీ కూడా తాత్కాలిక పద్ధతిలోనే చదువులు సాగిస్తున్నారు. పూర్తిస్థాయి ఫ్యాకల్టీ నియమించాలి. ల్యాబులు ఏర్పాటు చేయాలి. విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పించాలి. తాత్కాలిక ఇంజనీరింగ్ కాలేజీ భవనాన్ని పూరిస్థాయి వసతులున్న చోటకు మార్చాలి. లేకుంటే విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తాం.

సీఎం రేవంత్‌తో తుమ్మల సమావేశం

మీనాక్షి నటరాజన్‌తోనూ భేటీ



ఖమ్మం, జూలై 30 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఇటీవల సీతారామ ప్రాజెక్టు అంచనాలు పెంచుతూ ప్రభుత్వ పరంగా అనుమతించినందుకు ప్రాజెక్టు పనులు సత్వరం పూర్తి చేసేందుకు సహకరించిన సీఎంకు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై వారిద్దరూ చర్చించారు. ఆ తర్వాత మంత్రి తుమ్మల.. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తోనూ భేటీ అయ్యారు. ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు, కాంగ్రెస్ వ్యవహారాలతో పాటు జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై ఆమెతో చర్చించారు.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- అర్హత ఉన్న ప్రతీ వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు
- నాలుగైదు రోజుల్లో పెండింగ్ ధాన్యం బోనస్ జమ
- పగటి వేషగాళ్ల మాటలు నమ్మొద్దు
- నేలకొండపల్లి పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



లబ్ధిదారులకు రేషన్ కార్డును అందజేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం జరిగేదని, కార్డులు రాని వారు బాధ పడొద్దని, అర్హత ఉన్న ప్రతీ వ్యక్తికి రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇంటిని ఇస్తామని పాలేరు శాసనసభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నేలకొండపల్లి మార్కెట్ యార్డులో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన వారు ఒక్క రేషన్ కార్డును కూడా ఇవ్వలేదని, ఇందిరమ్మ రాజ్యంలో 5లక్షల పైచిలుకు రేషన్ కార్డులను అందజేస్తున్నామన్నారు. ఇది పేదల ప్రభుత్వమని, వారికి అండగా ఉంటామని, ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కలిగించటం వల్ల ఇప్పటి వరకు రూ.5వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. మహిళలను కోటీశ్వరులను చేయటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. మహిళా సంఘాలకు 25 లక్షల మందికి సున్నా వడ్డీకి రూ.25వేల కోట్లిచ్చామన్నారు. సన్న ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చామని, పెండింగ్ బోనస్ డబ్బు నాలుగైదు రోజుల్లోనే రైతులకు అందుతాయన్నారు. ఇటీవలి కాలంలో కొందరు పగటి వేషగాళ్లు వస్తున్నారని, అలాంటి మాటలు నమ్మాల్సిన అవసరం లేదన్నారు. ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 19,690 రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 62వేల మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, అర్హత ఉన్నవారందరికీ కార్డులిస్తామని చెప్పారు. ఈనెల 25 నుంచి అన్ని మండలాల్లో రేషన్ కార్డుల జాతర జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ బోర్డు చైర్మన్ మువ్వా విజయబాబు, నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, బొడ్డు బొందయ్య, మోర మల్లయ్య, బొల్లినేని వెంకన్న, కైలాసపు వెకటేశ్వర్లు, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, తేజావత్ శివాజీ, మల్లెబోయిన శ్రీనివాసరావు, గుడిమళ్ల మధు, కట్టా రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ప్రభుత్వాస్పత్రులపై ప్రజలకు నమ్మకం పెంచాలి

- ఇక నుంచి ఆధార్ బేస్డ్ హాజరు
- తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యులతో కలెక్టర్ సమీక్ష

6



కూలేందుకు సిద్ధంగా ఉన్న రేకుల ఇంటి ముందు కాంత, అక్క కొడుకు శ్రీను

మంజూరు సరే.. నిర్మాణమెలా?

- వర్షం వస్తే మరుగుదొడ్డే నివాసం
- పట్టుకుంటే కూలే దశలో ఇల్లు
- దయనీయ స్థితిలో నిరుపేద కుటుంబం
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు

7



ఉమ, రాజేష్‌లను సన్మానిస్తున్న కేశవరావు, యోగితారాణా.

ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలి

- డీఈవోల సదస్సులో ప్రభుత్వ సలహాదారు కేశవరావు
- ఇద్దరు ఖమ్మం ఉపాధ్యాయులకు సత్కారం

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ లక్ష్యమని, ఈ లక్ష్యానికి అనుగుణంగా ప్రతీ ఉపాధ్యాయుడు కృషిచేయాలని ప్రభుత్వ సలహాదారుడు కే.కేశవరావు కోరారు. ప్రభుత్వ విద్యను ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో నిర్వహించిన జిల్లా విద్యాశాఖాధికారుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. పాఠశాల విద్యాశాఖపై కే.కేశవరావు సమీక్షించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంపై కేశవరావు సంతోషం వ్యక్తం చేశారు. విద్యాశాఖకు ప్రభుత్వం ఇస్తున్న ప్రత్యేక ప్రాధాన్యతతో అనేకమంది తల్లిదండ్రులు ప్రైవేటు బడులను వదిలి ప్రభుత్వ బడుల్లో చేర్పిస్తున్నారని విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా అన్నారు. ఈ సందర్భంగా 70మంది విద్యార్థులను ప్రైవేటు నుంచి ప్రభుత్వ బడుల్లో చేర్పించిన ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు ఉమ, రాజేష్‌ను కేశవరావు, యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి నవీన్ నికోలస్ సన్మానించారు.

ఎర్రబోడు ప్లాంటేషన్ వద్ద ఉద్రిక్తత

- మొక్కలు నాటే పనికి వెళ్తున్న ఎక్స్‌కవేటర్ల అడ్డగింత
- అటవీ సిబ్బంది, పోడుసాగుదారుల మధ్య వాగ్వాదం



పోడు సాగుదారులు, ఫారెస్ట్ సిబ్బంది మధ్య వాగ్వాదం

కారేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అటవీ అధికారులు ప్లాంటేషన్‌లో మొక్కలు నాటే పనులు చేపట్టగా.. పోడుసాగుదారులు అడ్డుకోవడంతో కారేపల్లి మండలం ఎర్రబోడు అటవీ ప్రాంతంలో బుధవారం ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. పరస్పరం కేసులు పెట్టుకునే వరకు దారితీసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలివీ. ప్లాంటేషన్‌లో బుధవారం అటవీ అధికారులు మొక్కలు నాటేకార్యక్రమం చేపట్టగా విషయం తెలుసుకుని పోడు సాగుదారులు అక్కడి భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఈ క్రమంలోనే అటవీ సిబ్బంది కారేపల్లి రూరల్ సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి, కామేపల్లి ఎస్‌ఐలు గోపి, సాయికుమార్, సిబ్బంది బందోబస్తు మధ్య మొక్కలు నాటేందుకు రెండు ఎక్స్‌కవేటర్లను తీసుకొస్తుండగా.. వాటిని పోడుసాగుదారులు అడ్డుకున్నారు. దాంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి.. ఉద్రిక్తత ఏర్పడింది. తమకు ప్రత్యామ్నాయం చూపిన తరువాతే ప్లాంటేషన్‌లో పనులు చేయాలని పోడు సాగుదారులు డిమాండ్‌చేశారు. దీంతో పోలీసులు, ఫారెస్టు అధికారులతో మాట్లాడారు. అయితే పోడుపై హక్కులు తెచ్చుకుంటే మేం ఈ భూముల జోలికిరామని, మభ్యపుచ్చే మాటలతో తమ జీవితాలు ఆగం చేయాలని చూస్తున్నారని పోడుదారులు ఆవేద వ్యక్తం చేశారు. దాంతో ఎఫ్‌డీవో వెంకన్ననాయక్ స్పందించి.. ప్లాంటేషన్ పనులకు అడ్డుచెప్పవద్దని, ఖమ్మంలోని ఫారెస్టు కార్యాలయానికి వస్తే సమస్యలపై చర్చిద్దామని, ఇప్పటికైతే ఎక్స్‌కవేటర్లను వదిలేయాలని కోరడంతో పోడుదారులు ఆందోళన విరమించారు.

మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన బిల్లులు, భోజన కార్మికుల గౌరవవేతనాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రెగ్యులర్ బిల్లులు మొత్తం రూ.కోటి72లక్షలు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.సత్యనారాయణ తెలిపారు. జూన్ నెల వరకు ఉన్న పెండింగ్ బిల్లులను విడుదల చేశారన్నారు. ఇక జూన్ వరకు విద్యార్థులకు వంట ఖర్చులు, వంట సహాయకుల గౌరవవేతనాలను నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఒకటో నుంచి 8వ తరగతుల విద్యార్థులకు సంబంధించిన భోజన ఖర్చులు రూ.కోటి31లక్షల పైచిలుకు, వంట సహాయకుల గౌరవ వేతనాలు రూ.23.08లక్షలను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు.

‘సమస్యల’ ప్రాంగణం!

- అధ్వానంగా కొత్తగూడెం బస్టాండ్
- 50 ఏళ్లు గడుస్తున్నా.. కానరాని అభివృద్ధి
- చినుకు పడితే ఆవరణంతా చిత్తడి చిత్తడే..


అధ్వానంగా ఉన్న బస్టాండ్ ఆవరణ

కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ప్రాంగణంలో కనీస వసతుల్లేక అధ్వానస్థితిలో దర్శనమిస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా రాష్ట్రాలకు ప్రయాణించాలంటే.. కొత్తగూడెం బస్టాండ్ మీదుగానే వెళ్లాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో నిత్యం సుమారు 25వేల మందికి పైగా ప్రయాణికులు.. 200 ఆర్టీసీ బస్ సర్వీసులలో తమరాకపోకలు కొనసాగిస్తున్నారు.

50 ఏళ్లు గడుస్తున్నా.. అభివృద్ధి జాడేదీ?

10 కాదు.. 20 కాదు.. ఏకంగా 50 ఏళ్లు గడుస్తున్నా.. కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ పురోగతి మాత్రం కనిపించడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత జలగం వెంగళరావు 1976లో కొత్తగూడెం బస్టాండ్‌ను నిర్మించారు. బస్టాండ్‌ను నిర్మించి ఇప్పటికీ 50 ఏళ్లు పూర్తవుతున్నా.. కనీస వసతులు కల్పించక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన జిల్లాల విభజనలో కొత్తగూడేన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసినా.. అభివృద్ధిలో మాత్రం ఎన్నో మైళ్ల దూరంలోనే నిలిచిపోయింది. కనీసం బస్టాండ్ లోపలికి వెళ్లే ఇన్ గేట్ బోర్డుపై కూడా కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ పేరు లేకపోవడం గమనార్హం. బస్టాండ్ ప్రాంగణంలోని అనేక సమస్యతో పాటు తాగడానికి మంచి నీరు అందించే ఆర్‌వో వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారడంతో.. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చినుకు పడితే చిత్తడే..!

కొత్తగూడెం బస్టాండ్‌లోకి అడుగుపెడితేనే భారీ గుంత స్వాగతం పలుకుతోంది. ప్రాంగణం మొత్తం గుంతలే.. ఆ గుంతలలోనే భారీగా వర్షపు నీరు నిండడంతో.. ప్రయాణికులు, వాహనదారులు అందులో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. బస్టాండ్ పైకప్పు లీక్ కావడంతో.. వర్షాలు కురుస్తున్న సమయంలో వరద నీరు భారీగా ప్లాట్‌ఫామ్ పైకి చేరి బురదమయంగా మారుతోంది. అలాగే నిండిపోయిన మరుగుదొడ్ల నుంచి వ్యర్థ పదార్థాలు సైతం బయటికి ఉప్పొంగి ప్రవహిస్తూ.. దుర్వాసన వస్తుంది. ఈ ప్రవాహం నుంచే ప్రయాణికులు జంపింగ్‌లు చేస్తూ ప్లాట్ ఫామ్ వద్దకు చేరుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడుతోంది. బస్టాండ్‌లో గత రెండు నెలలుగా కొన్ని మరమ్మతు పనులను ప్రారంభించినా.. అవి నత్తనడకన కొనసాగుతుండడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. నూతన బస్టాండ్ భవన నిర్మాణం కోసం ఆరు నెలలు క్రితమే కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇదే గనుక ఆచరణ రూపందాల్చి కొత్త బస్టాండ్ మంజూరైతే.. జిల్లా కేంద్రంలో ప్రయాణికులకు మెరుగైన వసతులతో పాటు సదుపాయాలూ అందే అవకాశాలు ఉన్నాయి.


బస్టాండ్ ప్రధాన ద్వారం బోర్డుపై పేరు లేని దృశ్యం

ప్రయాణికులకు వసతులు కల్పిస్తాం..
దేవేందర్‌గౌడ్, కొత్తగూడెం ఆర్టీసీ డీఎం

ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్టాండులో అన్ని వసతులు కల్పిస్తున్నాం. వారి ప్రయాణం సురక్షితంగా జరిగేలా చర్యలు చేపట్టాం. చేపట్టిన మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తాం. వానాకాలంలో బస్టాండ్ ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచేందుకు పర్యవేక్షించి అన్ని చర్యలు తీసుకుంటాం.

పట్టుదలకు కృషి తోడైతే అద్భుత విజయం

సమర్థవంతమైన విధులకు క్షేత్రస్థాయి అనుభవం అవసరం

ఐఏఎస్ 11వ ర్యాంకర్ సాయిశివానికి కలెక్టర్ అనుదీప్ అభినందన


సాయి శివాని తల్లిదండ్రులతో ఖమ్మం కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పట్టుదలకు, కృషి తోడైతే అద్భుత విజయాలు సాధ్యంమవుతాయని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. 2024 ఐఏఎస్ బ్యాచ్‌లో 11వ ర్యాంక్ సాధించిన వరంగల్‌కు చెందిన రాజు, రజిత దంపతుల కుమార్తె సాయి శివాని తల్లిదండ్రులతో కలిసి బుధవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్, సాయి శివాని, ఆమె తల్లిదండ్రులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఐఏఎస్‌గా బాధ్యతలు, ట్రైనింగ్, పరిపాలన విధులు ఏ విధంగా ఉంటాయో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆమెకు వివరించారు. క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకున్నప్పుడే ప్రభుత్వ అధికారి, తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలరని సూచించారు. అధికారులు ప్రజలకు సేవలు అందించడానికి ఎంతో అవకాశం ఉందని ‘నేనేం చేస్తున్నాను, సమాజం నా నుండి ఏం ఆశిస్తోంది. నా పరిధిలో ఏం చేయగలను’ అనేది ఆలోచించాలన్నారు. మనం చేసే పనిలో ఇబ్బందులు, కష్టాలు తాత్కాలికమని వాటిని తట్టుకుని మళ్ళీ నిలబడాలన్నారు. చిన్నతనంలో తాను సాధారణ విద్యార్థి మాత్రమేనని, జీవితంలో ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఐఏఎస్ పాస్ అయ్యానని శివాని కలెక్టర్‌కు వివరించారు.

ఇల్లెందు సబ్ జైలును సందర్శించిన జడ్జి


సబ్‌జైల్‌ను పరిశీలించిన జడ్జి కీర్తి చంద్రికరెడ్డి

ఇల్లెందు టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఇల్లెందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రికరెడ్డి ఇల్లెందు సబ్‌జైలును బుధవారం సందర్శించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఖైదీలకు మెనూ ప్రకారం సదుపాయాలు అందుతున్నాయా లేదాని వారిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని పరిశుభ్రత పాటించాలని ఖైదీలకు సూచనలు చేశారు. ఆర్థికస్థోమత లేని ఖైదీలకు ప్రీలీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వార న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. జడ్జి వెంట సబ్‌జైల్ సూపరింటెండెంట్ ఎస్.చంద్రశేఖర్, హెడ్ వార్డెన్ భుజరంగరాజు, సబ్‌జైలు సిబ్బంది కే.శ్రీనివాస్, భాస్కర్, లీగల్ ఎయిడ్ న్యాయవాది కీర్తి కార్తీక్, సిబ్బంది ఉన్నారు.

భద్రాద్రిలో ఐదు.. ఖమ్మంలో రెండు

ఉమ్మడి జిల్లాలో ఏడు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం సన్నాహాలు

టూరిజం హబ్‌లుగా అభివృద్ధికి కసరత్తు

వసతులపై నివేదిక కోరిన కేంద్ర పర్యాటక శాఖ

జూలూరుపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో త్వరలో పర్యాటక హబ్‌లు ఏర్పాటు కానున్నాయి. గ్రామాలను టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్ది అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పర్యాటక కేంద్రాల ఏర్పాటుకు అవకాశం ఉన్న గ్రామాలను అధికారులు గుర్తించారు. దీంతో హబ్‌ల ఏర్పాటుకు ఆయా ప్రాంతాల్లో ఉన్న వసతులు, స్థలాలను పరిశీలించి నివేదిక అందించాలని ఐటీడీఏకు కేంద్ర పర్యా టక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఫలితంగా త్వరలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 7 గ్రామాల్లో పర్యాటక కేంద్రాల ను ఏర్పాటు చేయనున్నారు. భద్రాద్రి జిల్లాలో 5 చోట్ల, ఖమ్మం జిల్లాలో 2 చోట్ల వీటిని ఏర్పాటు చేయనున్నారు.


చింతలతండా గ్రామ ముఖచిత్రం

పర్యాటక హబ్‌లుగా తీర్చిదిద్దనున్న గ్రామాలు ఇవే..

భద్రాద్రి జిల్లాలోని జూలూరుపాడు మండలం చింతల తండా, మణుగూరులో పగిడేరు, అశ్వారావుపేటలో గోగులపుడి, ఇల్లందులో పుబ్బెల్లి, భద్రాచలంలో ట్రైబుల్ మ్యూజియంతో పాటు ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు మండలం గార్లఒడ్డు, పెనుబల్లి మండలం పులిగుండాల గ్రామాలలో పర్యాటక హబ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులు గుర్తించారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో పలు సౌకర్యాలను కల్పించనున్నారు. వీటిని సందర్శించిన పర్యాటకులకు కనువిందు చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఈ కేంద్రాలలో పర్యాటకులు ప్రత్యేకంగా బస చేసేందుకు హోం స్టే కేంద్రాల వసతి కల్పించనున్నారు. ఒక్కో హబ్‌లో 5 హోం స్టే కేంద్రాల నిర్మాణాలను చేపట్టనున్నారు. అదే విధంగా పలు రకాల వసతులను ఈ కేంద్రాలలో కల్పించడంతో పాటు ఆహారాన్ని అందుబాటులో ఉంచాలని సంకల్పించారు. పర్యాటకులు గుట్టలపైకి ఎక్కేందుకు ట్రెక్కింగ్ సౌకర్యాన్ని కూడా అధికారులు అందుబాటులోకి తీసుకు రానున్నారు.

వసతుల నివేదికను అందించాలని ఆదేశాలు

పర్యాటక కేంద్రాలుగా ఏర్పాటు చేయనున్న గ్రామాలలో పరిస్థితులు, వసతుల వివరాలు, సాధ్యసాధ్యాలపై నివేదికను అందించాలని కేంద్ర పర్యాటక శాఖ ఐటీడీఏ పీవోను ఆదేశించింది. దీంతో ఐటీడీఏ పీవో.. ఆయా మండలాల ఎంపీడీవోల నుంచి వివరాలను సేకరించారు. నివేదికను త్వరితగతిన అందించాలని ఆదేశించారు. 7 మండలాలలో వాటికి సంబంధించిన వసతులు, హోంస్టేల నిర్మాణాలకు స్థలాల గుర్తింపు, ఇతర అంశాలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఒక కమిటీను ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీలో ఎంపీడీవోతో పాటు ఇద్దరు ఐటీడీఏ సిబ్బంది, అటవీ శాఖ బీట్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు. కమిటీ సభ్యులు పర్యాటక కేంద్రాలుగా ఏర్పాటు చేయనున్న ప్రాంతాలను సందర్శించి వసతులను, స్థలాన్ని పరిశీలించి.. రెండు రోజుల్లో ఐటీడీఏ పీవోకు నివేదికను అందజేయనున్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

327 యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ శ్రీధర్


జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీధర్

సుజాతనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రాష్ట్ర విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం (327) యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఈ.శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లో ఐఎన్‌టీయూసీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌రంగ సంస్థలో పనిచేస్తున్న విద్యుత్‌రంగ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు యాజమాన్యం చొరవ చూపాలన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేసే ఆర్టిజన్ కార్మికులకు స్టాండింగ్ రూల్స్ తీసుకువచ్చి ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఒకే సంస్థలో రెండు వేర్వేరు పర్మిషన్‌లు ఉండటం సరికాదన్నారు. ఆర్టిజన్‌ల సమస్యల పరిష్కారాని అనేక మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, ఎస్పీడీసీఎల్ ఐఎన్‌టీయూసీ పాకాల మహేందర్‌రెడ్డి, కార్యదర్శి పి.శ్రీనివాసరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ చింతలపూడి సతీష్‌కుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రాజేష్, కాంగ్రెస్ సుజాతనగర్ మండల అధ్యక్షుడు చింతలపూడి రాజశేఖర్, ఐఎన్‌టీయుసీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సగం ఖాళీగానే!

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పాలేరు జేఎన్‌టీయూలో ప్రిన్సిపాల్ తప్పా మిగిలిని ప్రొఫెసర్లను అవుట్‌సోర్సింగ్ కింద తాత్కాలిక వేతనంతో నియమించారు. 24మంది ప్రొఫెసర్లు ఉండాల్సి ఉండగా కేవలం ఏడు గురు మాత్రమే తాత్కాలిక వేతనంతో పనిచేస్తున్నారు. ఇక్కడ నాలుగో ఏడాది కూడా మొదలైతే 34మంది ప్రొఫెసర్లుండాలి. వాస్తవానికి ప్రభుత్వం జెన్‌టీయూ కాలేజీలు ప్రారంభించినప్పుడు మొదట్లోనే పూర్తిస్థాయి ప్రొఫెసర్లను నియమించడంలేదు. దీంతో జేఎన్‌టీయూకున్న ప్రతిష్ట మసకబారుతోంది. ఇక్కడ సీటు వచ్చిన విద్యార్థులు ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీవైపు వెళ్లే పరిస్థితి ఉంది. కాలేజీ ప్రారంభించిన తర్వాత ఇప్పటి వరకు జేఎన్‌టీయూ అధికారులు, ఉన్నత విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడం, సమీక్షించకపోవడం లాంటి కారణాలతో కాలేజీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉన్నత విద్యాశాఖ నిర్వహణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల్లోనే ఉండగా.. జేఎన్‌టీయూ కళాశాలల పరిస్థితిపై సమీక్షలు చేస్తే వాస్తవ పరిస్థితులు అర్థమయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కళాశాల దుస్థితిపై విద్యార్థి సంఘాల నాయకులు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి యోగితారాణాకు వినతిపత్రాలు అందించారు.

కాలేజీ అభివృద్ధికి దశలవారీగా ఆందోళన చేస్తాం

● **ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి**



పాలేరు జేఎన్‌టీయూ కళాశాల సమస్యలపై వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరి యోగితారాణి, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించాం. కానీ ఏఒక్కటీ పరిస్కారం కాలేదు. నిధులు మంజూరైనా భవనాలకు టెండర్లు పూర్తి చేయలేదు. పాలకమండలి పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. అందుకే విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేస్తాం.

కుటుంబ సభ్యులకు వ్యక్తి అప్పగింత

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన కుక్కమూడి రవికుమార్ ఏప్రిల్ నెల 17వ విజయవాడ నుంచి ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలలో బంధువులను చూడటానికి వచ్చి మతిస్థిమితం కోల్పోయి ఏటో వెళ్లిపోయాడు. అతని కుమారుడు బాబురావు ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్లో తండ్రి కుక్కముడి రవికుమార్ ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల నుంచి తప్పిపోయినట్లు ఏప్రిల్ 17న ఫిర్యాదు చేశాడు. బుధవారం కామేపల్లి మండలం పొన్నెకల్ గ్రామపరిసర ప్రాంతాల్లో గుర్తుతెలియని 50ఏళ్ల వ్యక్తి నడవలేని స్థితిలో చెత్తకుప్పల్లో తిరుగుచుండగా గమనించిన పొన్నెకల్లు గ్రామానికి చెందిన మాలోతు మున్నానాయక్ కుటుంబ సభ్యులు చేరదీసి ఖమ్మం నగరంలోని అన్నం ఫౌండేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే అన్నం శ్రీనివాసరావు సదరు వ్యక్తి అన్నం ఫౌండేషన్‌కు తీసుకొచ్చి ఫొటోలను విజయవాడలోని కుటుంబ సభ్యులకు పంపారు. టూటౌన్ సీఐ బాలకృష్ణ సమక్షంలో ఆ వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్, కండక్టర్ పాత్ర కీలకం

● **డిప్యూటీ ఆర్‌ఎం మల్లయ్య**

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్, కండక్టర్ పాత్ర ఎంతో కీలకమని ఉమ్మడి ఖమ్మం డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆర్‌ఎం) మల్లయ్య కొనియాడారు. బుధవారం ప్రగతి చక్రం పురస్కారాల ప్రదానం కొత్తగూడెం డిపో గ్యారేజ్‌లో నిర్వహించగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్, డ్రైవర్లకు, మెయింటెనెన్స్ సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. డిపో మేనేజర్ ఎం.దేవేందర్‌గౌడ్, ట్రాఫిక్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, గ్యారేజ్ సూపర్‌వైజర్ రత్నం, సెక్యూరిటీ ఇన్‌చార్జి భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.


ప్రశంసా పత్రాలను అందజేస్తున్న డిప్యూటీ ఆర్‌ఎం మల్లయ్య

ఖమ్మం గడ్డను..

బీజేపీ అడ్డాగా మారుస్తాం

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. బీజేపీని అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారని, మేధావులు సైతం పార్టీ విధానాలకు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఆధారం కోల్పోయిన పార్టీ అని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులు కూడా కరువైన పరిస్థితిని చూశామన్నారు. ఈ కార్యక్రమాల్లో మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాం నాయక్, బీజేపీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకరరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మనోహర్, కొత్తగూడెం నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ తిమ్మిరి నరేంద్రబాబు, పట్టణ అధ్యక్షుడు రాపాక రమేష్, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి భూక్యా రవి నాయక్, ఇల్లెందు పట్టణ, మండల అధ్యక్షులు సుచిత్రాపాసీ, భట్టు రమేష్, మురళికృష్ణ, బాలగాని గోపి, రాంచంద్ర నాయక్, మవునూరి మాదవ్, దోమల మహేష్, విమల్, పాల్వంచ మండల అధ్యక్షుడు పోలోజు క్రాంతికుమార్, కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు శ్రీరాం, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

● **వారిద్దరి పాపం మా మీద తోస్తే ఎట్లా ?**

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో వారిద్దరూ చేసిన పాపాన్ని తమ మీదకు తోస్తే ఎట్లా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు అన్నారు. నాడు అప్పటి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవిస్తున్న తరుణంలో తీసుకున్న నిర్ణయాలనే తాము వచ్చిన తర్వాత అమలు చేశామని స్పష్టం చేశారు. అయినప్పటికీ భద్రాద్రి స్థానికుల మనోభావాలను గుర్తించి తన వంతు ప్రయత్నంతో పాటు పార్టీ పరంగా కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. భద్రాచలంలో మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్‌తో పాటు ఆయన శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గత, ప్రస్తుత ప్రభుత్వాలు రామాలయ అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. ప్రసాద్ పథకంలో భాగంగా కేంద్రం రామాలయ అభివృద్ధికి రూ.98 కోట్లు కేటాయించగా.. తొలి విడతలో రూ.43 కోట్లు విడుదల చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం అదే రీతిలో రామాలయ అభివృద్ధిని చేయాలన్నారు. హిందూ ఆలయాలు, సంస్థలపై ఇటీవల కాలంలో దాడులు జరుగుతున్నాయన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రభుత్వం మాట్లాడేందుకు ధైర్యం కూడా చేయడం లేదని విమర్శించారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు.

ప్రభుత్వాస్పత్రులపై ప్రజలకు

నమ్మకం పెంచాలి

- ఇక నుంచి ఆధార్ బేస్డ్ హాజరు
- తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యులతో కలెక్టర్ సమీక్ష


హాజరైన అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించి సర్కారీ దవాఖానాలపై ప్రజల్లో మరింత నమ్మకం పెంచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. బుధవారం ఆయన తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యులతో ఆసుపత్రుల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. జిల్లాలో నాలుగు ఏరియా ఆసుపత్రులు, మూడు సామాజిక ఆరోగ్య కేంద్రాలు వైద్య విధాన పరిషత్ ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సత్తుపల్లి, మధిర, కల్లూరు ఏరియా ఆసుపత్రుల నూతన భవనాల నిర్మాణం పూర్తయి, ప్రారంభానికి సిద్ధమయ్యాయన్నారు. ప్రారంభానికి ముందే తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలన్నారు. మిగిలిఉన్న చిన్న చిన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. వైద్యుల హాజరు సక్రమంగా ఉండాలని, మరో రెండు రోజుల్లో వైద్యులంతా ఆధార్ ఆధారిత హాజరు యాప్‌లో నమోదు కావాలన్నారు. అనుమతి లేకుండా గైర్హాజరు అవ్వొద్దని, క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లాల్సి ఉంటే హాజరు నమోదు తర్వాతనే వెళ్లాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న పరికరాల ఆడిట్ చేయాలని, మరమ్మతుల్లో ఉన్న పరికరాల వివరాలు తన దృష్టికి తేవాలని, ప్రతీ పరికరం పనిచేసేలా మరమ్మతులు పూర్తిచేసి సమర్థవంతంగా వినియోగించాలన్నారు. అవసరమైన మందులు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండాలని, సరఫరా లేకపోతే స్థానికంగా కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని, బయటి మందులు రోగులకు రాయొద్దని కలెక్టర్ సూచించారు. పరీక్షలు టి హబ్‌కు పంపేవి కాకుండా, ఆసుపత్రుల్లో కిట్లు ఉన్నవి అక్కడే చేయాలని కలెక్టర్ తెలిపారు. బ్లడ్ బ్యాంక్, డయాలసిస్ యూనిట్, మార్చురీల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈ సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యశాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, వైద్యులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల అధ్యయన యాత్ర

భద్రాచలం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పోలవరం పేరుతో భద్రాద్రి ప్రాంతానికి ముంపు సమస్య ఏర్పడితే స్పందించని కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చె బుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలంలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ముంపు ప్రాం తాల అధ్యయన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపి రామయ్య భూములకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రకట్ట రక్షణ గోడ కూలి నెల రోజులు గడుస్తున్నా, పదువుల కోసం కొట్టుకోవడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గడ్డం స్వామి, ఏజే రమేష్, ఎంబీ నర్సారెడ్డి, ఎర్రంశెట్టి వెంకట రామారావు, పొరెల్లి సంతోషకుమార్, సీతాలక్ష్మి, నకిరికంటి నాగరాజు, నాదెండ్ల లీలావతి, ఉస్తెల జ్యోతి, బెల్లంకొండ కుసుమ, జీవన జ్యోతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాస్‌లో రాష్ట్రస్థాయి

మూడో ర్యాంక్


డీఈవోను సన్మానిస్తున్న విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ సాధన సర్వే పేరుతో 2024 డిసెంబరు 4న పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 3, 6, 9 తరలగతుల విద్యార్థులు పాల్గొన్నారు. వీరితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బుధవారం ఫలితాలు వెల్లడించడంతో రాష్ట్ర స్థాయిలో ఖమ్మం జిల్లాకు మూడో ర్యాంక్ వచ్చినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె. సత్యనారాయణ తెలిపారు. బుధవారం హైద్రాబాద్‌లో డిఈవోను విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్, ప్రభుత్వ సలహాదారుడు కె. కేశవరావులు అభినందించి సన్మానించారు.

వైరా గురుకులం తనిఖీ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

వైరా, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో మధ్యాహ్నభోజనాన్ని అధికారులు తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ వెంకట్రావ్, వైరా ఎస్ఐ పి.రామారావు, ప్రిన్సిపల్ సమత, సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టెంబరు 9నుంచి ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై30 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 9వ తేదీ నుంచి మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష క్షేత్ర ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభమవుతుందని, పవిత్ర క్షేత్ర దర్శనాలే లక్ష్యంగా ఈ ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టామని ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్, టైర్ టైమ్స్ డైరెక్టర్ జి. విఘ్నేశ్ తెలిపారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈయాత్ర 15రోజులు పాటు ఉంటుందన్నారు. ఇండియన్ రైల్వేస్, భారత్ గౌరవ్ టూరిస్టు రైలు, సౌత్‌స్టార్ రైలు, భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వశాఖ గుర్తింపు పొందిన అగ్రశ్రేణి టూరిస్టు రైలు ఆపరేటర్ టూర్ టైమ్స్ ఈయాత్రకు శ్రీకారం చుట్టిందన్నారు.ఈసమావేశంలో టూర్‌టైమ్స్ జనరల్ మేనేజర్ సంతోష్, యాకేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యలో 'పేట'కు ప్రథమ స్థానం

విద్యారంగానికి రూ.కోట్లలో నిధులు
కొండతోగులో నూతన పాఠశాల ప్రారంభంలో ఎమ్మెల్యే జారే
గిరిజన విద్యకు ఎనలేని ప్రాధాన్యం : పీవో రాహుల్


పాఠశాల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీవో రాహుల్


కొండతోగులో పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పీవో రాహుల్

అశ్వారావుపేట రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యలో అశ్వారావుపేట నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని.. ఈ ప్రాంతంలో విద్యారంగానికి ఏటా కోట్లాది రూపాయల నిధులను తీసుకువచ్చి అన్ని సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన కొండతోగులో పాఠశాల లేకపోవడం.. విద్యార్థుల ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల వరుస కథనాలు రావడంతో.. స్పందించిన అధికారులు ఎట్టకేలకు ఐటీడీఏ ద్వారా గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. ఈ నూతన పాఠశాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. పాఠశాల ప్రారంభం నేపథ్యంలో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఐటీడీఏ పీవో రాహుల్ ప్రత్యేకంగా తయారు చేయించిన ఉద్దీపకం పుస్తకాలను చిన్నారులకు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ.. విద్యా రంగంలో అశ్వారావుపేట నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. విద్య విషయంలో గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండాలన్న లక్ష్యంతోనే నూతనంగా పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం పాఠశాల తాత్కాలికంగా అంగన్‌వాడీ కేంద్రంలో నడుస్తోందని, ఆగస్టు 15నాటికి భవనంలో అన్ని మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. అలాగే నూతనంగా పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వచ్చే ఏడాదికి కొత్త భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గిరిజన విద్యార్థులు మధ్యలో చదువు ఆపకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని, అందుకు అవసరమైన కోచింగ్‌ను తన సొంత ఖర్చులతో ఇప్పిస్తున్నట్లు తెలిపారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి రూ.వందల కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఐటీడీఏ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఉద్దీపకం పుస్తకాలను తయారు చేయించామన్నారు. ఉన్నత విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు బట్టీ విధానం ద్వారా కాకుండా సృజనాత్మకంగా చదువులు కొనసాగించాలని సూచించారు. అంతకు ముందు మామిళ్లవారిగూడెం ఉన్నత పాఠశాలలో ఎంఈవో ప్రసాదరావు ప్రత్యేక చొరవతో పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించారు. కొండతోగులో జరిగిన కార్యక్రమంలో ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ, ఏటీడీవో చంద్రమోహన్, ఏసీఎంవో రమేశ్, ఎస్‌సీఆర్‌పీ వరబాబు, రాజబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జూపల్లి రమేశ్, సీనియర్ నాయకులు సుంకవల్లి వీరభద్రరావు, మండల అధ్యక్షులు రాంబాబు, డీఈ బాపనయ్య, ఏఈ ప్రసాదరావుతో పాటు పలువురు నాయకులు, వివిధ శాఖల అధికారులు, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు భద్రాద్రి జిల్లాకు ఆర్టీఐ కమిషనర్ల రాక

చట్టం అమలు తీరు పరిశీలనకు రెండు రోజుల పర్యటన
వివరాలు వెల్లడించిన భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్


భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కుచట్టం (ఆర్టీఐ) అమలు తీరును సమీక్షించేందుకు గాను రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్లు పీవీశ్రీనివాసరావు, దేశాల భూపాల్, బొరెడ్డి అయోధ్యరెడ్డి గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రానున్నారు. వారి పర్యటన వివరాలను బుధవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం వెల్లడించారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని శాఖల ప్రజా సమాచార అధికారులు (పీఐవోలు), అప్పిలేట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అప్పీలుదారులతో విచారణ ఉంటుందని, ఆగస్టు 1 శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మరో విడత ఆర్టీఐ అప్పీల్ విచారణలు నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా అన్నిశాఖల పీఐవోలు, అప్పిలేట్ అధికారులు6(1) కింద దాఖలైన ఆర్టీఐ దరఖాస్తుల రసీదులు, సమాధానాలు అవసరమైన పాయింట్ల వారీ సమాచారంతో విచారణలకు హాజరుకావాల్సి ఉంటుందని కలెక్టర్ ఆదేశించారు. అన్ని విభాగాల పీఐవోలు, ఏఏలు ఈ సమీక్షలకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. సమాచార హక్కు చట్టం అమలులో పారదర్శకత పెంపొందించడంలో భాగంగా ప్రతి కార్యాలయంలో ఆర్టీఐ బోర్డులను ప్రదర్శించాలని ఇందుకు తగినచర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయాలి

విశ్రాంత ఉద్యోగుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలి
యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్


సన్మాన సభలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి

అశ్వారావుపేట రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండేళ్ల గడువుదాటినా ఇంతవరకు పీఆర్‌సీ అమలు చేయలేదు. పీఆర్‌సీ నివేదిక ప్రకారం 2023 జూలై 1 నుంచి పీఆర్‌సీని అమలు చేయాలని, 2024 మార్చి నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. మండలంలోని నారాయణపురం జిల్లా ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మావతి ఉద్యోగ విరమణ సన్మాన సభను బుధవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సన్మానసభకు హాజరైన చావా రవి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం ప్రమాదంలో ఉందని, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని, పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. అన్ని విభాగాలకు చెందిన పాఠశాలలు, కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ బాధ్యులు కళ్యాణం నాగేశ్వరరావు, రమేశ్, కృష్ణారావు, మడకం వెంకటేశ్వరరావు, హరినాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు


సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

సుజాతనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. బుధవారం సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని పోలీస్ సిబ్బంది సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాలల్లోని ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొబేషనరీ ఎస్ఐ ఉమ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న బొలెరో వాహనం

ఎర్రుపాలెం, జూలై30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం గ్రామ శివారులో అతివేగం కారణంగా బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనగా ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణాజిల్లా మైలవరం గ్రామనికి చెందిన కాంచన శేఖర్(39) బంధువులు, కుటుంబసభ్యులతో జమలాపురం శ్రీవారి దర్శనానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో శేఖర్ ద్విచక్రవాహనంపై, భార్య, కుటుంబ సభ్యులు, బంధువులు ట్రాక్టర్‌పై బయలుదేరారు. శేఖర్ ముందుగా ద్విచక్ర వాహనంపై వెళ్లగా.. పిల్లవాడు నాన్న కావాలనడంతో భార్య అతనికి ఫోన్‌చేసింది. అతను వెనుదిరిగి జమలాపురం చేరవలోకి రాగా మైలవరం వైపు అతివేగంతో వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి శేఖర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టగా అతని తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెండాడు. శేఖర్ తండ్రి సుబ్రమణ్యేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేష్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతునికి భార్య కుమారుడు ఉన్నారు.

వాగులో పడి వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి- కాకర్లపల్లి మధ్య తోగువాగులో పడి ఒక వ్యక్తి మృతి చెందిన విషయాన్ని స్థానికులు బుధవారం పోలీసులకు సమాచారం అందించారు. వివరాలు ఇలా.. మృతుడు దమ్మపేట మండలం మందలపల్లిలో ప్రకాష్‌నగర్‌కు చెందిన పలాటి రమేష్(45)గా పోలీసులు గుర్తించారు. వాగులో మూడు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చని, రమేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తూ.. సత్తుపల్లి సీఐ శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2 వేల లీటర్ల టిన్నర్ ఆయిల్ స్వాధీనం


టిన్నర్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ

తల్లాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని ఓ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న షెడ్‌లో అక్రమంగా నిల్వ చేసిన 2 వేల లీటర్ల టిన్నర్ ఆయిల్‌ను బుధవారం తల్లాడ ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పోలీసు సిబ్బందితో కలిసి దాడిచేసి పది డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన రూ.2 లక్షల విలువగల 2 వేల లీటర్ల టిన్నర్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు మనోజ్‌కుమార్ శర్మ అనే వ్యక్తిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

దుమ్ముగూడెం జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి కె.రేగుబల్లి సమీప ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం, కారు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనదారునితో పాటు కారు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వాహనదారుడు కె.రేగుబల్లికి చెందిన కె.రామకృష్ణగా తెలుస్తోంది. కారు నడుపుతున్న వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి గాయపడిన వారిని చికిత్స కోసం భద్రాచలం తరలించారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

సత్తుపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పలు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురిని సత్తుపల్లి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సత్తుపల్లి సీఐ శ్రీహరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం వాహన తనిఖీ చేస్తుండగా వేంసూరు రోడ్డులోని మెట్టాంజనేయ స్వామి ఆలయ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న కందుకూరి సోమాచారి, మారోజు సూర్యప్రకాష్, కందుకూరి రత్నగిరిలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 21.5 గ్రాముల బంగారపు ముద్ద, 200గ్రాముల వెండి వస్తువులు, రెండు సెల్‌ఫోన్లు, రూ.9400నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ప్రైవేట్ వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్

భద్రాద్రిలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో వెలుగుచూసిన ఘటన
నిందితుడిపై సైబర్ క్రైం కింద కేసు నమోదు

భద్రాచలం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని కల్యాణ మండపం రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ లాడ్జిలో యువతీ యువకుల ప్రైవేట్ వీడియో తీసి వారిని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు వసూలు చేస్తున్న ఘటనపై పోలీసులు సైబర్ క్రైం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పాల్వంచకు చెందిన యువతి యువకులు సుమారు నాలుగు నెలల క్రితం భద్రాచలంకు వచ్చి కల్యాణ మండపం రోడ్డులో ఉన్న ఓ లాడ్జిలో రూము అద్దెకు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సమయంలో వారు ఇరువురు కలిసి ఉన్న వీడియోను వారికి తెలియకుండా తీసి లాడ్జిలో పని చేసే వ్యక్తి మీ వీడియో తన వద్ద ఉందని దాన్ని అడ్డుపెట్టుకుని డబ్బులు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో వారు మూడు విడతలుగా నగదు ఇచ్చినప్పటికీ మళ్లీ మళ్లీ ఫోన్ చేస్తుండటంతో ఆ జంట భద్రాచలం పోలీసులను ఆశ్రయించారు. దీంతో పట్టణ పోలీసులు సైబర్ క్రైం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా లాడ్జిలో పని చేసే వారే ఈ పని చేశారా, లేక వీరితో పాటు ఇంకెవరి పాత్ర అయినా ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

చర్లలో ముమ్మరంగా పోలీస్ తనిఖీలు


చర్ల బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్సై నర్సిరెడ్డి

చర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) మావోయిస్టు పార్టీ అమరవీరుల వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో చర్ల పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. మంగళవారం చర్ల మండలంతో పాటు, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. చర్ల సీఐ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ తనిఖీల్లో పాల్గొన్నారు. వారోత్సవాల నేపథ్యంలో మావోయిస్టులు అలజడి రేపే అవకాశం ఉండడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. పాతచర్ల, లెనిన్‌కాలనీ, పూజారిగూడెం, ఆర్ కొత్తగూడెం, బస్టాండ్ సెంటర్, కొయ్యూరు, తాలిపేరు ప్రాజెక్టు ప్రాంతాల్లో తనిఖీలు జరిగాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి చర్ల మండలానికి వచ్చే వారి పేర్లు నమోదు చేసుకున్నారు. అనుమానంగా కనిపించిన వారిని ప్రశ్నించి వదిలేశారు. అలాగే చర్ల, భద్రాచలం రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. కార్లు, లారీలు, ఆటోలు, ద్విచక్రవాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో చర్ల మండలంలో ఎవ్వరైనా అనుమానాస్పందగా కనిపిస్తే చర్ల స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ రాజు వర్మ సూచించారు.

బిల్లు ఇవ్వలేదని పాఠశాలకు తాళం



తాళం వేస్తున్న కాంట్రాక్టర్

దుమ్ముగూడెం జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించనందుకు నిరసనగా కాంట్రాక్టర్ రాము బుధవారం కె.దంతెనం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తాళం వేశారు. పాఠశాలలో పలు మరమ్మతు పనులు నిర్వహించగా, నెలల తరబడి బిల్లులు చెల్లించడం లేదని తెలిపారు. కాగా తన కంటే ముందు చేసిన పనులకు వేరే కాంట్రాక్టర్‌కు బిల్లులో కొంత నగదు అడ్వాన్స్‌గా ఇచ్చినా.. అతను చేపట్టిన పనులు మధ్యలోనే వదిలేసి వెళ్లాడు. అనంతరం ఆ పనులను తాను పూర్తి చేసినట్లు కాంట్రాక్టర్ తెలిపాడు. ఈ ఇద్దరు కాంట్రాక్టర్ల మధ్య తలెత్తిన వివాదంతో బిల్లు చేయడానికి ప్రస్తుత హెచ్‌ఎం వెనుకాడుతుండడంతో ఈ సమస్య తలెత్తింది. ఏదైన ఉంటే పరిష్కరించుకోవాలని, పాఠశాలకు తాళం వేయడం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నించారు. దీంతో చివరకు తాళం తీశారు. దీంతో గంటకు పైగా విద్యార్థులు, హెచ్‌ఎంలు పాఠశాల బయట నిల్చున్నారు.

మంజూరు సరే.. నిర్మాణమెలా?

వర్షం వస్తే మరుగుదొడ్డే నివాసం
పట్టుకుంటే కూలే దశలో ఇల్లు
దయనీయ స్థితిలో నిరుపేద కుటుంబం
ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు


ఇదీ వృద్ధురాలు బానోతు కాంత ఇంటి పరిస్థితి


వర్షం వస్తే మరుగుదొడ్డిలోనే నివాసం..

కొణిజర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆమెది నిరుపేద గిరిజన కుటుంబం. కడు పేదరికంతో తల్లిడిల్లుతున్న ఆ వృద్ధురాలిని ప్రభుత్వం గుర్తించి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసింది. అయితే పూట గడవడమే కష్టంగా ఉన్న ఆమె.. ప్రస్తుతం ఇంటి నిర్మాణం ఎలా చేపట్టాలో తెలియక తల్లడిల్లుతోంది. యాచించి జీవనం కొనసాగిస్తున్న తనను ప్రభుత్వమే ఇల్లు పూర్తి చేసేలా ఆర్థిక సహాయం అందించాలని వేడుకుంటోంది. వివరాల్లోకి వెళితే.. కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామం బీసీ కాలనీలో నివాసం ఉంటోంది బానోతు కాంత. వివాహం అయిన కొద్ది సంవత్సరాల్లోనే భర్త వదిలి ఎటో వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తన అక్కతో పాటు అక్క కొడుకును దగ్గర ఉంచుకొని ఆమె జీవనం కొనసాగిస్తోంది. గతంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ఆ తర్వాత అక్క చనిపోవడం.. తనకు కూడా 60 ఏళ్ల వయసు కావడంతో ప్రస్తుతం ఏ పని చేయలేని స్థితికి చేరుకుంది. ఇది చాలదన్నట్టు అక్క కొడుకు శ్రీనుకు కూడా మతిస్థిమితం అంతంత మాత్రమే. దీంతో అతడిని దూరం చేసుకోలేక.. ఇద్దరూ కలిసి తనకు ఉన్న స్థలంలోనే కాలం వెల్లదీస్తున్నారు. నాలుగు సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేసుకొని పైన రేకులు, చుట్టూ ప్లాస్టిక్ సంచులు, అట్టాముక్కలను ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. శ్రీనుకు కూడా ఏ పనీ రాకపోవడంతో.. కాంతానే ప్రస్తుతం నాలుగు ఇళ్లల్లో యాచించి తెచ్చుకున్న ఆహారాన్ని తిని జీవనం వెల్లదీస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఆ రేకులు ఇల్లు కూడా ముట్టుకుంటే కూలిపోయే పరిస్థితి. దీంతో అది కూడా ఎప్పుడు కూలుతుందోనని భయం నీడన వారిద్దరూ కాలం గడుపుతున్నారు.



వర్షం వస్తే మరుగుదొడ్డే నివాసం

కూలిపోయే పరిస్థితిలో ఉన్న రేకుల ఇంటిలో కాంత కాలం వెల్లదీస్తోంది. అయితే వానాకాలంలో వర్షం వస్తే ఆమెకు మరుగుదొడ్డే ఆధారం. గతంలో ఈజీఎస్ ద్వారా ఒక మరుగుదొడ్డిని నిర్మించారు. ప్రస్తుతం ఆ మరుగుదొడ్డే వర్షానికి వారికి ఆసరా అవుతోంది. వర్షం వచ్చినప్పుడు మరుగుదొడ్డిలోనే ఉంటూ.. అక్కడే తింటూ, నిద్రిస్తుందంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. ఇంత దీనస్థితిలో ఉన్న కాంత ప్రస్తుతం తనను ఆదుకునే వారి కోసం వేచి చూస్తోంది. ఎవరైనా మానవత్వం కలిగిన వారు ఇంటిని నిర్మిస్తారని ఆశగా ఎదురు చూస్తోంది. ఇప్పటికే తన ఆరోగ్య పరిస్థితి బాగాలేదని, తను పోతే తనతో ఉంటున్న అక్క కొడుకు పరిస్థితి ఏంటని బోరుమంటోంది.

చేతులు జోడిస్తున్నా.. ఆదుకోండి : కాంత

నా దగ్గర రూపాయి కూడా లేదు. కడు దరిద్ర పరిస్థితుల్లో జీవిస్తున్నా.. అందుకే ప్రభుత్వం ఇంటిని మంజూరు చేసింది. ఎంతో సంతోషంగా ఉంది. కానీ ఇంటిని కట్టుకునే స్థోమత నాకు లేదు. చేతులు జోడించడం తప్పా.. నా దగ్గర ఏమిలేదు. ప్రభుత్వమే నా పరిస్థితిని అర్థం చేసుకొని పెద్ద మనసుతో ఆదుకోవాలి. ఉండేందుకు కనీసం ఒక్క గదినైనా కట్టించి ఇస్తే.. జీవితాంతం రుణపడి ఉంటా..

ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు మంజూరు

బానోతు కాంతకు మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. గ్రామంలో మంజూరైన 50 ఇళ్లల్లో కాంత పేరు మొదటిది. తన పేరు రావడంతో ఆ నిరుపేద గిరిజన మహిళ ఎంతగానో సంబుర పడింది. కానీ ఇంటి నిర్మాణం చేపట్టాలంటే తనకు మించిన స్థాయి కావడంతో ఏమీ చేయలేక ప్రస్తుతం దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటోంది. పొట్ట గడవటమే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో తాను ఇంటిని ఎలా కట్టుకోవాలని దీనంగా ప్రశ్నిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వమే ఆలోచించి పెద్ద మనసుతో తనకు ఒక్క గదినైనా నిర్మించి ఇవ్వాలని కాంత దీనంగా వేడుకుంటోంది.

అనుమానాస్పద స్థితిలో మునిసిపల్ కాంట్రాక్టర్ మృతి


సుధాకర్ (ఫైల్)

పాల్వంచ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో మున్సిపల్ కాంట్రాక్టర్ మృతి చెందిన ఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం గట్టాయిగూడెంకు చెందిన జరబన సుధాకర్(54) స్థానిక మున్సిపాలిటీలో కాంట్రాక్టర్‌గా కొనసాగుతున్నాడు. తన సోదరుడు సీతరాములు, మరో బంధువు నిడమనేని సతీష్‌లతో కలిసి మంగళవారం మధిరలోని ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. సాయంత్రం అతని కుమారుడు వెంకటేష్ తండ్రి సుధాకర్‌కి ఫోన్‌చేసి ఆరాతీయగా ఇంటికి రావడానికి ఆలస్యం అవుతుందని చెప్పాడు. అతని కుమారుడు మరలా రాత్రి 11 గంటల సమయంలో ఫోన్‌చేయగా సుధాకర్ ఫోన్ ఎత్తలేదు. బుధవారం ఉదయం విద్యుత్ ఎంప్లాయిస్ కాలనీలో అతను అచేతనంగా పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు వెంకటేష్‌కు ఫోన్ చేశారు. అక్కడకు చేరుకున్న సుధాకర్ కుటుంబ సభ్యులు హుటాహుటీన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందాడని నిర్ధారించారు. సుధాకర్ పడి ఉన్న ప్రదేశంలో పురుగుమందు డబ్బా ఉండటం, స్థానికులు చూసినప్పుడు అతని నోటి నుంచి నురగ వస్తుండడంతో సుధాకర్ ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ఎర్రుపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యుత్‌షాక్‌కు గురై గేదె మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని గుంటుపల్లి గోపవరంలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా.. గరిమిడి నరసింహారావుకు చెందిన గేదె మృతి చెందింది. అతను పాడి ద్వారా వచ్చిన ఆదాయంతో జీవిస్తున్నాడు. కాగా పొలానికి మేత కోసం వెళుతూ గేదె ట్రాన్సుఫార్మర్‌కు చెందిన ఎర్త్ వైరు తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందింది. నెలరోజుల కిందట ఇదే ప్రాంతంలో మేడగాని కృష్ణ అనే రైతుకు చెందిన ఆవు మృతిచెందింది. ఆ ఎర్త్‌వైరు తగిలి ఎన్నో జీవాలు మృతిచెందుతున్నాయి. యమపాశాలుగా మారిన ఈ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లతో స్థానిక ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. స్థానికులు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించినా వారు పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. కానీ శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

ఆళ్లపల్లిలో ఐదు పాడి గేదెలు...

దమ్మపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఐదు పాడి గేదెలు మృతి చెందిన ఘటన దమ్మపేట మండలం అల్లిపల్లి గ్రామ శివారులోని ఒక వ్యవసాయ క్షేత్రం వద్ద బుధవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాల ఇలా.. మందలపల్లి గ్రామానికి చెందిన ఉమ్మడి ఏసు, జుంజులూరి వెంకన్నలకు చెందిన గేదెలను అల్లిపల్లి సమీపంలోని ఒక వ్యవసాయ క్షేత్రంలో మేతకు తోలుకు వెళ్లారు. మేత మేస్తున్న గేదెలపై తోటలోని 11కేవి విద్యుత్ లైను తీగలు తెగి పడటంతో విద్యుదాఘాతానికి గురై ఉమ్మడి ఏసుకు చెందిన మూడు గేదెలు, వెంకన్నకు చెందిన రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. బాధితులు గుర్తించి వెళ్లి చూసేసరికే అవి మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.4లక్షలకు పైగా ఉంటాయని బాధితులు తెలిపారు. గేదెల ఆధారంతోనే తమ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని విలపిస్తూ తమను ఆదుకోవాలని కోరారు.



అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్, జూలై 30(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల3, 4 తేదీల్లో హన్మకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా అథ్లెటిక్స్ జట్లను బుధవారం సర్ధార్ పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు జిల్లావ్యాప్తంగా సుమారు 170మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికల్లో భాగంగా అండర్- 14, 16, 18, 20, సీనియర్ మెన్, ఉమెన్ విభాగాలకు పోటీలు నిర్వహించారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ ఎండీ షఫీక్‌అహ్మద్ తెలిపారు. ఎంపికలను అథ్లెటిక్స్‌కోచ్ గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు సుధాకర్, రవి, క్రిష్ణయ్య, వెంకటేశ్వర్లు, ముజాహిద్, నవీద్, రవి పలువురు సీనియర్ క్రీడాకారులు సమీక్షించారు.

ఆయిల్‌పాంలో అంతర పంటలు లాభదాయకం



పైనంపల్లిలో అంతర్ పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో

నేలకొండపల్లి, జూలై30(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పాంలో అంతర్ పంటల సాగుతో లాభదాయకమని సహాయ వ్యవసాయ సంచాలకుడు సతీష్ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పైనంపల్లి గ్రామానికి చెందిన ఓరుగంటి నారాయణరావుకు చెందిన ఆయిల్‌పాం తోటను ఏడీఏ సతీష్, ఎంఏఓ రాధ, వ్యవసాయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. రైతు నారాయణరావు ఆయిల్‌పాం తోటలో వేసిన అంతర పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తోటలో ఏర్పాటు చేసిన లింగాకర్షక బుట్టల వల్ల కలుగుతున్న లాభాలను తెలుసుకున్నరు. లింగాకర్షక బుట్టల ఏర్పాటు వలన పంటను నాశనం కలిగించే పురుగులు ఆకర్షితమై బుట్టలో పడిపోతాయన్నారు. ప్రతీ రైతు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో యం.రాధ, ఏఈఓ భవాని, రైతులు యడవల్లి సైదులు, వేనేపల్లి నాగేశ్వరరావు, జగదీష్ పాల్గొన్నారు.

2న జాబ్‌మేళా

ఖమ్మంఖానాపురం హవేలి, జూలై30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నయబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆగస్టు 2న హెచ్‌సీఎల్‌టెక్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24, 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఐటి, బీపీవోలో ఉద్యోగాల కల్పనకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్‌గ్రూప్ 75శాతం మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 8341405102, 7981834205 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

స్థంభాద్రి లక్ష్మీనరసింహస్వామి
వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభం

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై30 (ఆంధ్రజ్యోతి): శ్రీస్థంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ(గుట్ట)18వ వార్షిక పవిత్రోత్సవాలు బుధవారంనుంచి ప్రారంభమయ్యాయి. ఆగస్టు2 వరకు జరుగుతాయని ఈవో కొత్తూరు.జగన్ మోహన్‌రావు తెలిపారు. 31న 108 కలశాలతో అభిషేకం, యుక్తహోమం, ఆగస్టు 1న స్వాతీ నక్షత్రం స్వామివారి జన్మనక్షత్రం రోజున స్వామి గిరి ప్రదక్షణ, అష్టోత్తమూర్తి హోమం, 2న మహా కుంభాభిషేకం, శాంతిహోమం, మధ్యాహ్నం లక్ష్మీనరసింహస్వామి శాంతి కల్యాణం, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని చెప్పారు.

ఐఏఎస్ ర్యాంకర్ సాయిశివానీకి సన్మానం



సాయిశివానీని సన్మానిస్తున్న కరస్పాండెట్ సాంబశివారెడ్డి, సుధాకరరెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై30 (ఆంధ్రజ్యోతి): 2024 ఐఏఎస్ బ్యాచ్‌లో 11వ ర్యాంక్ సాధించిన ఇ.సాయిశివానీని బుధవారం నగరంలోని నిర్మలహృదయ్ పాఠశాలలో సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ సాంబశివారెడ్డి మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థిని యుపీఎస్సీ పరీక్షలలో జాతీయ స్థాయిలో 11వ ర్యాంకు సాధించించటం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థితికి ఎదగాలని దీవించారు. ఆమెతో పాటు తల్లితండ్రులను సన్మానించారు. సాయిశివానిని మాట్లాడుతూ క్రమశిక్షణ వినయవిధేయతలతో శ్రమిస్తే దేనినైనా సాధించవచ్చునని అన్నారు. పాఠశాల డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పద్మజా, శ్రావణి పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటండి

తిరుమలాయపాలెం, జూలై30 (ఆంధ్రజ్యోతి): నానాటికి పెరిగిపోతున్న వాతావరణ కాలుష్య నివారణకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గిరిజన బాలుర కళాశాల ప్రిన్సిపాల్ భాస్కరరావు తెలిపారు. బుధవారం మాదిరిపురంలోని ప్రభుత్వ బాలుర కళాశాల, పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ జోసఫ్ జాన్, అనిత, పున్నయ్య, బాబు, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో ఇరిగేషన్ ఫోరం కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులతో టీఎన్జీవో జిల్లా నాయకులు

ఖమ్మంకలెక్టరేట్, జూలై 30(ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో ఇరిగేషన్ ఫోరం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా టీఎన్జీవో జిల్లా, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దినేని రాధాకృష్ణ వ్యవహరించారు. ఫోరం అధ్యక్షుడిగా డి.రాజకుమార్, కార్యదర్శిగా భరత్ రెడ్డి, కోశాధికారిగా లెనిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్ అభినందించారు సభ్యులుగా నాగేశ్వరరావు, భీముడు, రవితేజ, గోవిందు, హరిప్రసాద్, శ్రీనివాసులు, కృష్ణ కుమారి, బీబ్సాహెబ్, రాము, శ్రీనివాస్ రావు,రామకృష్ణ, వాసు, అబ్దుల్, యాకూబ్, మదార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలు ప్రస్తావించారు.

భూసేకరణ వేగిరం చేయాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- భూసేకరణ అంశాలపె సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, జూలై30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ వేగిరం చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్, మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం, జాతీయ రహదారులు, ఖమ్మం ఖిల్లా రోప్‌వే అభివృద్ధి పనులకు భూ సేకరణ అంశాలపై బుధవారంసమీక్షించారు. మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు, అవసరమైన భూ సేకరణ తదితర అంశాలను అధికారులు వివరించారు. మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఖమ్మం రూరల్, అర్బన్ మండలాల్లో రైతులు అంగీకరించిన స్థలం, ప్రభుత్వ పట్టా భూముల్లో పనులు వేగవంతం చేయాలన్నారు. లేఔట్‌లో 10 మీటర్ల బ్రిడ్జి నిర్మాణం పనులకు డిజైన్ ఫైనల్ చేయాలని అన్నారు. ఖమ్మం రోప్‌వే నిర్మాణానికి అవసరమైన స్థలం సేకరణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో నీటిపారుదలశాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, ఆర్డీఓ నరసింహారావు, నేషనల్ హైవే మేనేజర్ దివ్య, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు సైదులు,రాంప్రసాద్ పాల్గొన్నారు.



మున్నేరు రిటైనింగ్‌వాల్ మ్యాపులను పరిశీలిస్తున్న కలెక్టర్

త్వరితగతిన రహదారి పూర్తి చేయాలి

పంచాయతీ రాజ్ అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మంరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయం రహదారిని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 25న 'ప్రయాణం....ప్రాణాంతకం'ప్రమాదాలకు నిలయంగా కేంద్రీయ విద్యాలయం రహదారి అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవటం తెలిసిందే.. ఈ కథనానికి కలెక్టర్ స్పందించారు. ప్రజలకు ఇబ్బందిగా మారిన రహదారిని పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. నిధులు మంజూరు అయినప్పటికీ నిర్మాణం చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి మంగళవారం రహదారిని పరిశీలించారు. రహదారి గుంతలమయమైనందున్న జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వీలైనంత త్వరలోనే రహదారి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఆంధ్రజ్యోతితో తెలిపారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత



హోంగార్డుకు బీమా చెక్కు అందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, జూలై30 (ఆంధ్రజ్యోతి): హోంగార్డు బాణాల రామచారి రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాడు. ఈనేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్ సాలరీ అకౌంట్‌తో వచ్చే ప్రయోజనాలు, ప్రమాద బీమా సొమ్ము రూ.15 లక్షల చెక్కును పోలీస్ కమిషనర్ సునీల్ అందజేశారు. కాలు కోల్పోయి ఇంటి వద్దనే ఉంటున్న హోంగార్డుకు పోలీస్ కమిషనర్ సూచనలతో వైరా ఎస్ఐ రామారావు చొరవ తీసుకున్నారు. విజయవాడకు చెందిన స్వచ్ఛంద సేవకుడు, రిటైర్డ్ విద్యుత్‌శాఖ ఉద్యోగి శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో ఇటీవల కృత్రిమ కాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ సుశీల్ సింగ్, హోమ్ గార్డు ఆర్ఐ సురేష్, వైరా ఎస్సై రామారావు, హోంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బంక శ్రీను, సీసీ వెంకటేశ్వర్లు, డి రవిబాబు, సిహెచ్ నాగరాజు, డి రమేష్, రహీమ్, జి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ సందర్శన

ప్రకాష్ నగర్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, పని తీరు పరిశీలించారు. రోడ్ల మరమ్మతులు, వర్షాలతో దెబ్బతిన్న సీసీ కెమెరాలను వెంటనే పునరుద్ధరించాలని సూచించారు.సీసీకెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కార్యాయం ప్రారంభం

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆధునీకరించిన సిటీ ఆర్ముడ్‌రిజర్వ్ ఇన్‌స్పెక్టర్(అడ్మిన్‌మరియు యంటీవో) కార్యాలయాలను సీపీ సునీల్‌దత్ బుధవారం ప్రారంభించారు. ఇక్కడ విధులు సజావుగా,సౌకర్యవంతంగా నిర్వహించేలా ఫర్నీచర్, తదితర ఏర్పాట్లు చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏఆర్ ఏసీపీలు సుశీల్‌సంగ్, నర్సయ్య, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ కామరాజు, శ్రీశైలం, సురేష్, నాగుల మీరా పాల్గొన్నారు.

జూబ్లిపురలో కొత్త కార్డుల పంపిణీ



ఖమ్మంకలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా రేషన్ కార్డులు లేని కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు అందించి, వాటి ద్వారా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తోందని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. బుధవారం స్థానిక 46 డివిజన్లో జూబ్లీపురలోని రేషన్ షాప్ నెంబర్ 3లో ఆమె రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి, త్రీటౌన్ కాంగ్రెస్ నాయకులు బాలగంగాధర్ తిలక్, రేషన్ డీలర్ షేక్ జానీ మియా, గూడెపు నాగరాజు షేక్ రజ్జి, షేక్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు

కలెక్టరేట్ ముట్టడి కరపత్రాల పంపిణీ

రఘునాథపాలెం,జూలై 30(ఆంధ్రజ్యోతి): పనిగంటల పెంపుతో మేడే స్ఫూర్తిని ప్రభుత్వం దెబ్బతీసిందని ప్రగతిశీల కార్మిక అనుబంధ కేజీబీవీ నాన్‌టీచింగ్ సంఘం రాష్ట్ర నాయకుడు ఆవుల అశోక్ విమర్శించారు. బుధవారం రఘునాథపాలెం కేజీబీవీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈనెల 31న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి, ఖమ్మంలో ర్యాలీ కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. నాయకులు కోటి లింగం, జ్యోతి, నాగలక్ష్మీ, రేణుక, మధు, చంద్రకళ, స్నేహలత, విజయ పాల్గొన్నారు.

బుచ్చి మరణం బాధాకరం

ఖమ్మంరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన సీపీఎం సానుభూతి పరుడు వెంకటబుచ్చి(48) గుండెపోటుతో మృతిచెందడం బాధాకరమని సీపీఎం కేంద్రకమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. మద్దులపల్లిలోని కుటుంబసభ్యులను బుధవారం తమ్మినేని పరామర్శించారు. అదేగ్రామానికి చెందిన పార్టీ సభ్యుడు కందుల రామస్వామి అనారోగ్యంతో బాధపడుతుండగా అయనను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

కేసముద్రంలో ఆటో... ఖమ్మంలో స్కూటీ ఒకటే నెంబరు

- ఆటో డ్రైవర్‌కు ట్రాఫిక్ జరిమానా సందేశం



కేసముద్రంలో తన ఆటోను చూపుతున్న ఇస్మాయిల్, కేసముద్రంలోని ఆటో నెంబరు ఉన్న ఖమ్మంలో స్కూటీ

కేసముద్రం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలో ఆటో డ్రైవర్ సయ్యద్ ఇస్మాయిల్‌కు ట్రాఫిక్ చలాన్ రూ.200 విధించినట్లు సెల్‌కు మెసేజ్ వచ్చింది. మునిసిపాలిటీ పరిధిలోని కిష్టాపురానికి చెందిన ఇస్మాయిల్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆటో కేసముద్రంలోనే ఉండగా ఖమ్మం కస్బా బజారులో ఈనెల 28న రాంగ్ పార్కింగ్ కింద ట్రాఫిక్ చలాన్ విధించినట్లు సందేశం రావడంతో ఖంగుతిన్నాడు. ఆన్‌లైన్‌లో పరిశీలించగా తన ఆటో నెంబరుతో ఖమ్మంలో ఒక స్కూటీ ఉన్నట్లుగా గుర్తించాడు. దీంతో స్కూటీ యజమానిపై చర్యలు తీసుకొని, చలాన్‌ను రద్దు చేయాలని ఇస్మాయిల్ కోరారు.

వ్యాధులపై చర్యలు తీసుకోవాలి

తిరుమలాయపాలెం, జూలై30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో వివిధ రకాల అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందని వీటిని నివారించేందుకు పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సిలార్‌సాహెబ్ తెలిపారు. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీవో సూర్యనారాయణ, శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు సుజాత, అనూష, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడికి ఫిర్యాదు

కామేపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు దళిత కుటుంబాలు కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పింజరమడుగులో చిప్పలపల్లి శ్రీనివాసరావు, చిప్పలపల్లి ఈశ్వరి, బీద లక్ష్మి, సీహెచ్ రేణుక ఈ ఫిర్యాదు చేశారు. ఇటీవల మా గ్రామానికి చెందిన కొందరు కులం పేరుతో దూషించి దాడి చేసి గాయపరిచారని వివరించారు. వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసులు మాత్రం నమోదు చేశారని, ఇంతవరకు పోలీసులు అరెస్ట్ చేయకుండా జాప్యం చేస్తున్నారని, వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపేందుకు కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. హుస్సేన్ నాయక్ సానుకూలంగా స్పందించి విచారించి తప్పకుండా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

విద్యార్థుల సమస్యలు విస్మరిస్తున్న ప్రభుత్వం

ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై30(ఆంధ్రజ్యోతి): గురుకులాల విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం విస్మరిస్తోందని వామపక్ష విద్యార్థి సంఘాల జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, ప్రవీణ్, వెంకటేష్ ఆరోపించారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షినిని కలిసి విద్యార్థుల సమస్యలు తెలియజేసేందుకు వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రయత్నించారు. ఆమె సమయం ఇవ్వకపోవటంతో ఖమ్మంలోని ఎస్సీ గురుకుల వసతిగృహం ఎదుట నిరసన తెలిపారు. ఉన్నతాధికారుల తీరు సరిగా లేక పోవటంతోనే క్షేత్రస్థాయిలో ఎస్సీ గురుకులాల విద్యార్థుల సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. ఫలితంగా భయాందోళనల మధ్య గురుకులాల విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని ఆరోపించారు.



నిరసన తెలుపుతున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కి ఆరు నెలల జైలు

ఖమ్మంలీగల్, జూలై30(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరిజిల్లా జమ్మాపూర్ గ్రామానికి చెందిన బంధనాథము సాగర్‌కు అనే డ్రైవర్‌కు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ సంచార ప్రత్యేక న్యాయస్థాన న్యాయాధికారి బి.నాగలక్ష్మి బుధవారం తీర్పుచెప్పారు. అజాగ్రత్తగా వాహనం నడిపి ఒక వ్యక్తి మరణానికి కారణమైన కేసులో ఈతీర్పు చెప్పారు. ఫిర్యాది మాతంగి వెంకటేష్ తమ్ముడు నరేష్ 2018లో మోటార్‌సైకిల్‌పై పాలేరు వస్తున్నాడు. అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చేసరికి హైదరాబాదు నుంచి ఖమ్మం వైపు వస్తున్న డీసీఎం వ్యాన్ నడుపుతున్న నిందితుడు అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ మోటార్‌సైకిల్‌పై వస్తున్న నరేష్‌నుఢీకొట్టాడు. స్థానికులు ఆయన్ను తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు కూసుమంచి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుని అరెస్టుచేసి కేసును విచారించి కోర్టులో చార్జిషీట్ దాఖలుచేశారు.

బీజేపీ నాయకులు పగటి కలలు కనొద్దు

సీపీఎం,సీపీఐ జిల్లా కార్యదర్శులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై30(ఆంధ్రజ్యోతి): కేరళ, బెంగాల్‌లో కమ్యూనిస్టులు బీజేపీలో చేరారని, ఖమ్మంలోనూ ఆదే తీరు ఏర్పడుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పగటి కలలు కనొద్దని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, దండి సురేశ్ ఖండించారు. ఈ మేరకు వారు విడి విడిగా బుధవారం పత్రికా ప్రకటనలు విడుదల చేశారు.

సంతాన సాఫల్య కేంద్రాలు నిబంధనలు పాటించాలి

జిల్లా వైద్యాధికారి కళావతిబాయి

ఖమ్మంకలెక్టరేట్, జూలై 30(ఆంధ్రజ్యోతి): సంతాన సాఫల్య కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతిబాయి హెచ్చరించారు. బుధవారం ఆమె ప్రోగ్రాం అధికారులతో సమీక్షించారు. విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సంతానం కోసం వచ్చిన దంపతులకు ఆరోగ్యం, నైతిక విషయాలను గుప్తంగా ఉంచాల్సి ఉంటుందన్నారు. చట్టప్రకారం దంపతుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచాలన్నారు. వారి ఆరోగ్య విషయాలు, రక్షణ, వైద్యపర వివరాలను దుర్వినియోగం చేసినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దంపతులు కూడా సంతానం కోసం కేంద్రాలకు వెళ్లే ముందు అక్కడ ఉన్న డాక్టర్ల నైపుణ్యం, వారి విజయాల శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, నిబంధనలు కూడా తెలుసుకొని వెళ్లాలని దీనిపై పూర్తి అవగాహన కల్పించుకుని వెళ్లాలని ఆమె సూచించారు.జిల్లాలో రిజిస్టర్డ్ ఏఆర్టీ సెంటర్లు 7, సరోగసి సంతాన సాఫల్య కేంద్రాలు రెండింటికి మాత్రమే అనుమతులున్నాయని ఆమె స్పష్టం చేశారు. ఈ కేంద్రాలు ప్రతినెల రాష్ట్రానికి, జిల్లాకార్యాలయానికి రిపోర్టను పంపాల్సి ఉందని తెలిపారు.



25వ డివిజన్‌లో మేయర్ పునుకొల్లు నీరజ

ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ సంక్షేమం

ఖమ్మం కార్పొరేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతాయని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. బుధవారం 25వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్లమంజూరు పత్రాలను పంపిణీ చేశారు. పదో డివిజన్‌లో మాజీకార్పొరేటర్ చావా నారాయణరావు, 3వ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకుడు మలీద్ మనీష్, 8వడివిజన్‌లో కార్పొరేటర్ లకావత్ సైదులునాయక్, 46వ డివిజన్‌లో కార్పొరేటర్ కన్నం వైష్ణవి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపత్రాలను లబ్ధిదారులకు అందించారు.



3వ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు మనీష్



వైఎస్‌ఆర్ నగర్‌లో కార్పొరేటర్ సైదులునాయక్



పదో డివిజన్‌లో కాంగ్రెస్ నాయకుడు చావా

7 నుంచి 'నెలనెలా వెన్నెల' వార్షికోత్సవం

- నాలుగురోజుల పాటు వేడుకలు
- ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై30 (ఆంధ్రజ్యోతి): నెలనెలావెన్నెల 8వవార్షికోత్సవం సందర్భంగా ఆగష్టు 7,9,110తేదీలలో ఉభయతెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం నగరంలోని మిత్రా సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్,మోటమర్రి జగన్మోహన్‌రావు, కొత్తూరు.దేవేంద్ర, చీఫ్‌ప్యాట్రన్స్‌నాగబత్తినిరవి, కురువెళ్ల ప్రవీణ్, వేల్పుల.విజేత, వేముల సదానంద్ వివరాలు వెల్లడించారు.గతసంవత్సరం మూడు రోజుల పాటు నిర్వహించామని చెప్పారు. ప్రతీ నాటికకు రూ.30వేలు అందజేస్తామని, పోటీల అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు అదనంగా మరోసారి నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నాటికల వివరాలు

కళాంజలి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కొత్త భూతం, చైతన్యకళాభారతీ కరీంనగర్ వారి ఆధ్వర్యంలో ఖరీదైన జైళ్లు, మైత్రీ కళానిలయం విజయవాడ వారి ఆధ్వర్యంలో బ్రహ్మాస్వరూపం, న్యూస్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో ఐఏట్ ఇండియా, అరవింద ఆర్ట్స్ తాడేపల్లి ఆధ్వర్యంలో విడాకులు కావాలి, మిత్రా క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఇది రహదారికాదు, గోవాడ క్రియేషన్స్ ఆధ్వర్యంలో అమ్మ చెక్కిన బొమ్మ, చైతన్య కళాస్రవంతి ఉక్కునగరం వారి ఆధ్వర్యంలో (అ)సత్యం అనే నాటికలు ప్రదర్శించనున్నారు.

మనగుడికి రూ.5,16,116వితరణ



సత్యనారాయణను అభినందిస్తున్న సభ్యులు

సత్తుపల్లిరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని జేవీఆర్ పార్క్ సమీపంలో మనగుడి ఆలయ నిర్మాణానికి సత్తుపల్లికి చెందిన కంచర్ల సత్యనారాయణ రూ.5,16,116వితరణగా అందజేశారు. శ్రీ ప్రసన్న గణపతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మితమవుతున్న ఈ ఆలయాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు.వెంకటేశ్వరరావు, రవిరాజు, చెన్నారావు, మిట్టపల్లి గంగ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే



మంత్రి కోమటిరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు నిమిత్తం రాష్ట్ర మంత్రులను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఆర్‌అండ్‌బి శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళికతో చదవాలి



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న శ్రీజ

చింతకాని, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళికతో చదవి, జీవితంలో రాణించాలని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె పరిశీలించి విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఎంఈవో రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌కు అనుమతిపై అసంతృప్తి

- జేవీఆర్ గ్రౌండ్‌లో వచ్చేనెలలో ప్రారంభం
- పక్కనే బాలికల హాస్టల్
- వాకర్స్‌కు తప్పని తిప్పలు





జేవీఆర్ కళాశాల ఆవరణలో ముమ్మరంగా సాగుతున్న ఎగ్జిబిషన్ ఏర్పాట్లు

సత్తుపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని జేవీఆర్ ప్రభుత్వ కళాశాల మైదానంలో ఎగ్జిబిషన్‌ను వచ్చేనెలలో భారీ స్థాయిలో ప్రారంభించేందుకు కొన్ని రోజులుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీని కోసం కళాశాల మైదానంలో భారీ నిర్మాణాలు చేస్తున్నారు. వినోదం కోసం ఏర్పాటుచేస్తున్న ఈ ఎగ్జిబిషన్‌కు అధికారులు అనుమతులు ఇవ్వడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండు నెలలపాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్ వారికి ఆదాయం వస్తుందేమోకానీ పలు సమస్యలు ఎదురయ్యే పరిస్థితి ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆవరణలోనే బాలికల హాస్టల్

మైదానానికి ఆనుకుని జేవీఆర్ డిగ్రీ కళాశాలతో పాటు విద్యార్థినుల వసతి గృహం, పక్కనే బాలికల జూనియర్ కళాశాల ఉన్నాయి. ప్రస్తుతం కళాశాల తరగతులు నడుస్తున్న దృష్ట్యా ఇక్కడ ప్రతిరోజూ నిర్వహించే ఎగ్జిబిషన్ కారణంగా ఇబ్బందులు వస్తాయని అంటున్నారు. మైదానంలోనే బాలికల వసతి గృహం ఉంది. ఎగ్జిబిషన్ చూసేందుకు నిత్యం వందలాది మంది వచ్చే అవకాశం ఉండడంతో విద్యార్థినుల రక్షణపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఎగ్జిబిషన్‌కు వినోదం కోసం వచ్చే ప్రజల రణగొణ ధ్వనులతో హాస్టల్ విద్యార్థినులకు ఇబ్బందిగా మారే పరిస్థితి ఉంది.

వాకర్స్‌కు అక్టోబర్ 10వరకు కష్టమే..

కళాశాలలో ఆవరణలో మూడు దశాబ్దాల నుంచి వాకర్స్ ఇక్కడే వాకింగ్ చేస్తున్నారు. ప్రభుత్వం కూడా వాకర్స్ కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసింది. అంతంత మాత్రమే వసతులు ఉన్న ఈ మైదానంలో ఎగ్జిబిషన్ కారణంగా అక్టోబర్ 10వ తేదీ వరకు వాకింగ్ కష్టమని వాకర్స్ అంటున్నారు. ట్రాక్‌పై వాకింగ్ చేయడంతోపాటు గ్రౌండ్‌లో వ్యాయమం చేయడం, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్ ఆడటం చేస్తుంటారు. అప్పుడప్పుడు చారిటీ క్రికెట్ మ్యాచ్‌లు కూడా జరుగుతుంటాయి. వీటన్నింటికీ రెండు నెలల పాటు బ్రేక్ పడనుందని అంటున్నారు.

వీవీఐపీలకు హెలిప్యాడ్

సత్తుపల్లి పరిసర ప్రాంతాలలో వీవీఐపీలు పర్యటన కోసం హెలికాప్టర్‌లో వస్తే ఈ కళాశాల మైదానంలోనే హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తారు. హెలికాప్టర్ ల్యాండింగ్‌కు కళాశాల మైదానమే సురక్షితమని అధికారులు బావిస్తూ ఇక్కడ హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. కొద్ది రోజుల్లో నియోజకవర్గ పర్యటనకు వీవీఐపీ ఒకరు వచ్చే అవకాశం కూడా ఉందని అంటున్నారు. ఆయన వస్తే హెలిప్యాడ్ ఎక్కడ ఏర్పాటు చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పార్కింగ్, మరుగుదొడ్ల సమస్య..

ఎగ్జిబిషన్‌కు పెద్ద సంఖ్యలో సందర్శకులు వచ్చే అవకాశం ఉండడంతో కళాశాల ఆవరణలో పార్కింగ్ సమస్య వచ్చే అవకాశం ఉంది. సాధారణంగా ఇక్కడ ఏ కార్యక్రమం జరిగినా కళాశాల ఆవరణలోకి వాహనాలు అనుమతించరు. ఇదే పరిస్థితి కొనసాగితే ఎగ్జిబిషన్‌కు వచ్చిన వారు తమ వాహనాలను జాతీయ రహదారి పక్కన పార్క్ చేయాల్సి ఉంటుంది. దీని వల్ల జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఇన్ని సమస్యల నేపథ్యంలో సమస్యలను పట్టించుకోకుండా అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

కళాశాల అనుమతి ఇచ్చింది.. మేం ఇచ్చాం

కె.నరసింహా, మునిసిపల్ కమిషనర్, సత్తుపల్లి

కళాశాల మైదానంలో ఆగస్టు 15వ తేదీ నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు ఎగ్జిబిషన్ సాగనుంది. కళాశాల మైదానంలో ఏర్పాటుకు కళాశాల ప్రిన్సిపాల్ అనుమతి ఇచ్చారు. దాని ఆధారంగా కనీస రుసుము రూ.20వేలకు అనుమతి ఇచ్చాము.

బాలికల వసతిగృహాన్ని సందర్శించిన కమిషనర్

సత్తుపల్లిరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్టీ వసతి గృహాన్ని సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ కొండ్రా నరసింహా గురువారం ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహాన్ని విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతి, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు రావాని, వర్షాకాలం దృష్ట్యా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వార్డెన్ మాధవిని ఆదేశించారు. పిచ్చిమొక్కలను తొలగించడం, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు మునిసిపల్ ట్రాక్టర్‌లో వేయాలని, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి నిధుల మంజూరు

వైరా, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపూడి ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.12లక్షలు మంజూరయ్యాయని పంచాయతీరాజ్‌శాఖ డీఈఈ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఈ భవన నిర్మాణానికి డీఈ మార్కింగ్ ఇచ్చారు. తక్కువ వ్యవధిలో ఈ భవన నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని తెలిపారు. పీఆర్ ఏఈఈ ప్రదీప్, కాంగ్రెస్ నాయకులు జవ్వాజి నాగరాజు, నిర్మల, ఇస్మాయిల్, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

తల్లాడ, జూలై30 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్‌నేరాలపై అవగాహనసదస్సు నిర్వహించారు. కాలక్రమేణా టెక్నాలజీ పెరుగుతూ ఉండడంతో సామాన్య ప్రజలు అనేక రకాల ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారని ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు. వీటి పట్ల ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారి దగ్గరనుంచి ఎలాంటి ఫోన్‌కాల్స్ వచ్చినా రెస్పాండ్ అవ్వకుండా ఎలాంటి ఓటీపీలు ఎవరికి పంపించకుండా ఉండాలని తెలిపారు. వీటన్నింటికి ఒక్కటే మార్గం ఎవరు ఏం చెప్పినా గుడ్డిగా నమ్మవద్దన్నారు. వ్యక్తిగత వివరాలు అంటే ఫోన్ నెంబరు, అకౌంట్ నెంబరు, ఆధార్ నెంబరులాంటివి ఇతరులకు తెలియపరచకుండా ఉండాలన్నారు.

బోటితండాలో ప్రత్యేక వైద్య శిబిరం



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కారేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోటితండాలో బుధవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చీమలపాడు ఉప ఆరోగ్య కేంద్ర వైద్యురాలు కళ్యాణి నేతృత్వంలో ఏర్పాటు చేసిన శిబిరంలో గ్రామస్థుల రక్త నమనాలను సేకరించారు. అనంతరం డెంగ్యూ మలేరియా, రాపిడ్ పరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. సిబ్బంది నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం



బస్సు సౌకర్యం కల్పించిన మధిర డిపో వారికి అభినందనలు తెలుపుతున్న దృశ్యం

కల్లూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని పలు ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థుల సౌకర్యార్థం మధిర డిపో వారు బస్సు సౌకర్యం కల్పించారు. బుధవారం నుంచి మధిర డిపో నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సును కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు నేరుగా వేళ్లేలా, పేద విద్యార్థుల సౌకర్యార్థం రాయితీపై బస్సు సౌకర్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు ఈ బస్సు సౌకర్యం కల్పించారు. కల్లూరులో జరిగిన గత ప్రజా వాణిలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయికి విజ్ఞాపన చేయగా స్పందించిటమే కాకుండ మధిర డిపో వారితో సంప్రదించారు. ఎంతో కాలం నుంచి కల్లూరు టు మధిర వేళ్లే రహదారి వైపున గల పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు బస్సు సౌకర్యం లేక ఇబ్బందుల పడుతున్న విషయాన్ని మండల సీపీఐ కార్యదర్శి దామాల దయాకర్, ఏఐటియూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబులు ఎమ్మెల్యే రాగమయి ద్వారా డిపో అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు స్పందించారు. దీంతో విద్యార్థుల ప్రయాణానికి ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించినందుకు సీపీఐ నాయకులు, విద్యార్థులు ఎమ్మెల్యేకు, డిపో వారికి కృతజ్ఞతలు తెలిపారు.

హామీల అమల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని

తల్లాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అలుచేయడంలో అధికార కాంగ్రెస్ పార్టీ విఫలమైందని సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం తల్లాడలోని జీఎస్‌ఆర్ గార్డెన్‌లో పార్టీ జిల్లా కమిటీ సమావేశం మోరంపుడి పాండు అధ్యక్షతన జరిగిన సత్తుపల్లి డివిజన్ ప్లీనరి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వాగ్దానాలు అమలు చేయని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వమని ధ్వజమెత్తారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పథకాలను ప్రారంభింప చేస్తున్నారని అరకొర నిధులు కేటాయించడం వల్ల ఇవి పూర్తయ్యే అవకాశం లేదన్నారు పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని అధికారానికి దూరం చేసేందుకు లక్ష్యంగా పోరాడడంతో 62 ఎంపీ సీట్లు తగ్గించ గలిగామన్నారు. చంద్రబాబు నాయుడు, నితీష్‌కుమార్‌ల సహకారంతో కేంద్రంలో మోదీ మంత్రివర్గాన్ని ఏర్పాటుచేశారని పేర్కొన్నారు. ఇండియా బ్రిటీష్ వ్యాపార ఒప్పందంతో దేశ ఉత్పత్తులకు తీవ్ర నష్టం జరుగుతుదని, సుంకం లేని వస్తువులను దేశంలో లభిస్తుంటే దేశ ఉత్పత్తులను అధిక ధర చెల్లించి ఎవరు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్రం హామీలు అమలుచేయకుండా ప్రజా ఉద్యమాలను అణిచివేయడం వంటి వాటికి వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమవుతున్నారని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శినాగేశ్వరరావు, రాష్ట్ర, జిల్లా నాయకులు మాచర్ల భారతి, మాదినేని రమేష్, తాతా భాస్కరరావు, శీలం సత్యనారాయణరెడ్డి, విఠల్‌రావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు,రామలింగేశ్వరరావు, కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

ఇంటికి డీసీసీ అధ్యక్షుడు శంకుస్థాపన

వైరా, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని రెండోవార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదవాళ్ల సొంతింటి కలను సాకారం చేస్తుందని పేర్కొన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకులు పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్‌గౌడ్, బోళ్ల గంగారావు, పల్లపు కొండలు, పమ్మి అశోక్, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, పణితి శ్రీను, రమేష్, రాజు, గోపి పాల్గొన్నారు.

ఎట్టకేలకు వెలిగిన వీధి దీపాలు

కారేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో రెండువారాలు తరువాత ఎట్టకేలకు సంబంధిత అధికారులు వీధిలైట్లు వెలిగించారు. ఫీజ్ బాక్స్ కాలిపోవడంతో గ్రామస్థులు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులు కొత్త ఫీజ్‌బాక్స్ ఏర్పాటుచేసి లైట్లు వెలిగించారు.

ఇంటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించొద్దు



మాట్లాడుతున్న డీపీవో ఆశాలత

బోనకల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని డీపీవో ఆశాలత సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బోనకల్, చింతకాని మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో అలసత్వం వహిస్తే ఎలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంద శాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సాధ్యమైనంత తొందరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఎప్పటికపుడు ఫోటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తకుండా చూడాలని కోరారు. వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకొని పారిశుధ్య మెరుగుదలకు పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంపీవో శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా డెయిరీపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ జేడీ పురంధేశ్వర్

మధిర రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మధిరలోని ఐకేపీ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరా డైరీపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ పురందేశ్వర్ మాట్లాడుతూ.. మొదటి విడత ఎస్సీ లబ్ధిదారులకు రెండు గేదెలను 80శాతం సబ్సిడీతో ఇప్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పాడిగేదెలు కొనుగోలు చేసిన తర్వాత వాటి సంరక్షణ గురించి వివరించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డీపీఎం శ్రీనివాస్, ఐకేపీ అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ముదిగొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలంలోని ఇందిరా డైరీ లబ్ధిదారులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారిణి విజయలక్ష్మీ మాట్లాడుతూ.. లబ్ధిదారులకు డైరీ పథకం ద్వారా రెండు గేదెలను ఇవ్వటం జరుగుతుందని, మొదటి విడతలో ఎస్సీలకు రెండు పాడిగేదెలను 80శాతం సబ్సిడీతో ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, వెటర్నరీ డాక్టర్ అశోక్, ఏపీఎం కల్పన, చంద్రశేఖర్, అనురాధ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైరాలో అరుదైన శస్త్రచికిత్స

వైరా, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వైరాలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో బుధవారం ఒక మహిళ కడుపులోనుంచి పదికిలోల కణితిని డాక్టర్ కవిత శస్త్రచికిత్స చేసి తొలగించారు. మునిసిపాలిటీ పరిధిలోని దిద్దుపూడి గ్రామానికి చెందిన కొత్తపల్లి మరియమ్మ కొన్నిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. వైరాలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌ను సంప్రదించగా డాక్టర్ కవిత ఆమెకు వైద్యపరీక్షలు చేసి కణితి ఉందని నిర్ధారించారు. అనంతరం శస్త్రచికిత్స చేసి మహిళ కడుపులోని పదికిలోల కణితిని తొలగించారు.

ప్రతీ కుటుంబానికి బీమా అవసరం

ముదిగొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బీమా ప్రతి కుటుంబానికి అవసరమని ఖమ్మం జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రవిప్రసాద్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రవిచంద్ర సూచించారు. బుధవారం ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జనసురక్ష పథకంపై ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు.

'స్థానిక'ంలో ఏకగ్రీవాల దిశగా పని చేయాలి



జానకీపురంలో సమరశంఖం పూరిస్తున్న మల్లు నందిని

బోనకల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాల దిశగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పని చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క సతీమణి మల్లు నందిని సూచించారు. మండలంలో జానకీపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన పార్టీ నాయకుల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని కోరారు. భట్టీ విక్రమార్క మండలంలో 300 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రజలు స్థానిక పోరులో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, పీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, జిల్లా, మండల నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, బందం నాగేశ్వరరావు, గాలి దుర్గారావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, మోదుగు సుధీర్ బాబు, ఎర్రంశెట్టి సుబ్బారావు, గూడ నర్సయ్యశాస్త్రీ, వట్టికొండ రామకృష్ణ, చేబ్రోలు రమాదేవి, ప్రమీల, ఆదిలక్ష్మీ, వై. హేమూన్, తదితరులు పాల్గొన్నారు.

మధిర రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పనిచేసి విజయం సాధించాలని అమ్మఫౌండేషన్ చైర్‌పర్సన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని పిలుపునిచ్చారు. బుధవారం మధిర మండలం మాటూరుపేట గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. 18నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తుందన్నారు. మధిర నియోజకవర్గంలో అభివృద్ధికి ఇప్పటికే భట్టి విక్రమార్క పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చారన్నారు. గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను, జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వీప్ చేయాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు సూరంశెట్టి కిషోర్, చిలివేరు బుచ్చిరాం, కర్నాటి రామారావు, చిట్టిబాబు, అద్దంకి రవి పాల్గొన్నారు.

సామాజిక సేవ కార్యక్రమాల్లో జేఎస్ఆర్ ట్రస్ట్

- మునిసిపాలిటీ కార్మికులకు, పేదలకు దుస్తుల పంపిణీ
- పాఠశాలకు ఆర్వోప్లాంట్ వితరణ



దుస్తులు అందిస్తున్న ట్రస్ట్ అధినేత జాస్తి

కల్లూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) కల్లూరులో బుధవారం జేఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 1.50 లక్షల అంచనాతో పలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మునిసిపాలిటీ కార్యాయంలో ఏర్పాటైన కార్యక్రమంలో 100మందికి పైగా మునిసిపాలిటీ కార్మికులకు ట్రస్ట్ అధినేత జాస్తీ శ్రీనువాసరావు, విశ్రాంత ఎంఈవో కాకర్ల రంగారావు చేతుల మీదగా దుస్తులు పంపిణీ చేశారు. అలాగే స్థానిక అంబేద్కర్‌నగర్, కప్పలబంధం గ్రామాల్లో వృద్ధులకు, పేద మహిళలకు కూడా దుస్తులు పంపిణీ చేశారు. అదే క్రమంలో కల్లూరు ఎన్నెస్పీ క్యాంపు సమీపాన గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తాగునీటి సౌకర్యార్థం రూ. 20 వేల విలువ గల ఆర్వో ప్లాంట్‌ను విరతరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పుటు చేసిన కార్యక్రమంలో ట్రస్ట్ అధినేత శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ జెఎస్ఆర్ ట్రస్టు తరుపున ప్రతి ఏడాది అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనపై తమ వంతుగా చేయూతనిస్తామని స్పష్టం చేశారు. కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలల్లో ఏవైన సమస్యలను ఉంటే నేరుగా ఉపాధ్యాయులు తెలియపరిస్తే అందుకు ట్రస్ట్ తరుపున చేయూత నిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలల హెచ్‌ఎంలు, పంచాయితీ మేనేజర్ మద్దిశెట్టి నాగేశ్వరరావులు మాట్లాడతూ.. జెఎస్‌ఆర్ ట్రస్ట్ తరుపున పలు రకాలుగా చేపట్టిన సేవ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పొట్టు శ్రీనువాసరావు, హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, మునిసిపాలిటీ కార్మికులు వజీర్‌మీయా, ఊడల కృష్ణ, చింతపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ముదిగొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అరుణాదేవి సూచించారు. బుధవారం ముదిగొండ మండలం ఖానాపురంలో ఆరోగ్య వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఇంటింటికి తిరిగి పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లత, ఏఎన్‌ఎం రత్నకుమారి, పంచాయతీ కార్యదర్శి నాగశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

25మంది రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

వైరా, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మురళీకృష్ణ హాస్పిటల్‌లో 25మంది రోగులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘట్టమనేని బాబూరావు పుట్టినరోజు సందర్భంగా బుధవారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉండ్రు శ్యాంబాబు, వై.బుచ్చిరామారావు, లగడపాటి ప్రభాకర్‌రావు, కొల్లా రాంబాబు, చింతోజు నాగేశ్వరరావు, గద్దే నీరజ, గజ్జల కృష్ణమూర్తి, కట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో పాస్‌బుక్ జారీ: రైతు ఆవేదన

బోనకల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల గ్రామ రెవెన్యూ పరిధిలో గల ఓ భూమికి సంబంధించి అన్నదమ్ముల నడుమ వివాదం నెలకొనగా ఫోర్జరీ సంతకాలు చేసి పాసు పుస్తకం తెచ్చుకున్నారని బాధిత రైతు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట విలేకరులతో ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ముష్టికుంట్లకు చెందిన వంగాల గోపయ్యకు ఇద్దరు భార్యలు, ఐదుగురు సంతానం. వారిలో ముగ్గురు కుమార్తెలకు వివాహం కాగా బయటకు వెళ్లారు. ఇక ఇద్దరు కుమారులకు సర్వే నంబర్ 279లో గల 1.13 గుంటల భూమిని సమానంగా పంచుకోవాలని గ్రామ పెద్దల సమక్షంలో నిర్ణయించుకున్నారు. కాని ఆ తరువాత తల్లి మృతి చెందింది. ఆ భూమిని సమానంగా పంచకుండా తన సోదరుడు నాగేశ్వరరావు ప్రోద్బలంతో ఎర్రగాని లక్ష్మీ పేరు మీదుగా పాసుబుక్ చేయించాడని వంగాల కొండలు ఆరోపించాడు. తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశాడు. ఈ విషయం పై తహసీల్దార్ రమాదేవిని వివరణ కోరగా నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేశామని, అనుమానాలు ఉంటే ఆర్డీవో కోర్టును సంప్రందించాలని తెలిపారు.

విషజ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలి

వైరా, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తున్న విషజ్వరాలను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించి వైద్య శిబిరాలు నిర్వహించాలని ఒక ప్రకటనలో కోరారు. మురుగునీటి నిల్వల ప్రవాహం లేకుండా చూడాలన్నారు. వీటి వల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు విస్తరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

అథ్లెటిక్స్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ఏన్కూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఏన్కూరు గురుకుల పాఠశల విద్యార్థులు ఎంపికయ్యారు. కల్లూరులో ఈనెల 27న జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. జావెలిన్‌త్రో సీనియర్స్ విభాగంలో శరత్, జూనియర్స్‌లో నరేష్, విజయ్‌లు ఎంపికయ్యారు. ఆగస్టు 7న వరంగల్‌జిల్లా జనగాంలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. ఈ సంర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఏటీపీ వేమురాజు, సీనియర్ అసిస్టెంట్ అనిల్, ఉపాధ్యాయులు అభినందించారు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్

మధిర రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించారు. బుధవారం మధిరలో జరిగిన బీఆర్‌ఎస్ సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు మాట్లాడారు. రిజర్వేషన్లు ఇస్తున్నామని, బిల్లును గవర్నర్‌కు పంపామంటూ మాటలు చెపుతూ కాలం వెళ్లబుచ్చుతుందన్నారు. నాయకులు వైవీ.అప్పారావు, రామారావు, శ్రీను, బొగ్గుల భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

గెస్ట్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏన్కూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు కేజీబీవీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీఆర్‌టీ బయోసైన్స్, పీజీ సీఆర్‌టీ సివిక్స్ పోస్టులకు గెస్ట్ ఉపాధ్యాయుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎస్‌వో లావణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ, బీఈడీ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఆగస్టు రెండోతేదీలోపు సర్టిఫికెట్లతో పాఠశాలలో దరఖాస్తులు చేయాలని, వివరాలకు 7386226393 నెంబర్లలో సంప్రదించాలన్నారు.